ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం
రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy | epaper.vaarthasandhya.com | VOLUME : 01 | Issue : 241 | Thursday 20-08-2026 | Editor : Seggem Kiran Kumar | Pages : 08 | Price : 6/-

# నీట్ సంస్కరణలపై సుప్రీం దృష్టి

ఎన్‌టీఏకు పూర్తి వివరాల సమర్పణ ఆదేశం
వ్యవస్థాగత మార్పులు శాశ్వతంగా అమలు కావాలన్న ధర్మాసనం
ప్రశ్నపత్రాల భద్రతపై కేంద్రం వివరణ



న్యూఢిల్లీ, ఆగస్టు 19 (వార్త సంధ్య): నీట్ పరీక్షల నిర్వహణ, భద్రతా ప్రమాణాలపై సుప్రీంకోర్టు మరోసారి కీలక వ్యాఖ్యలు చేసింది. పరీక్షల విధానంలో సంస్కరణలు కేవలం నివేదికలు, సిఫార్సులకే పరిమితం కాకుండా శాశ్వత వ్యవస్థగా అమలు కావాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. రాధాకృష్ణన్ కమిటీ, నందన్ నీలేకని కమిటీలు సూచించిన సంస్కరణల అమలుపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల పూర్తి వివరాలను సమర్పించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)ను ఆదేశించింది. నీట్-యూజీ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారం నేపథ్యంలో దాఖలైన పిటిషన్లపై జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ తరఫున దాఖలైన పిటిషన్‌ను కూడా కోర్టు పరిశీలించింది. పరీక్షల నిర్వహణలో వ్యవస్థాగత మార్పులు అవసరమని, ఒకసారి

మిగతాది 2 పేజీలో

# విద్యార్థుల గొంతు పిసికి చంపేస్తారా?

## 'శక్తి' స్కీమ్, జీవో–97 రద్దు చేయాలని విద్యార్థుల

విద్యార్థులపై పోలీసు
దమనకాండను
వెంటనే ఆపాలి: బీఆర్ఎస్



హైదరాబాద్, ఆగస్టు 20 (వార్త సంధ్య): 'శక్తి' స్కీమ్, జీవో-97ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు కఠినంగా వ్యవహరించడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా తప్పుబట్టింది. విద్యార్థులు తమ హక్కుల కోసం రోడ్డెక్కితే కేసులు, నిరసన చేస్తే లాఠీలతో అణచివేతకు పాల్పడతారా? అని ప్రశ్నించింది.

ఈ మేరకు బీఆర్ఎస్ వర్గాలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తూ, విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. "విద్యార్థుల గొంతు పిసికి చంపేస్తారా? ఇదేనా మీరు పోలీసులకు ఇచ్చిన ఆదేశాలు?" అంటూ ప్రశ్నించాయి.

'శక్తి' స్కీమ్, జీవో-97ను రద్దు చేయాలని విద్యార్థులు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేస్తుంటే వారిపై కేసులు నమోదు చేయడం, లాఠీలతో అణచివేయడం సరికాదని పేర్కొన్నాయి. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం ఎందుకు కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ప్రశ్నించాయి.





విద్యార్థులపై పోలీసు దమనకాండను వెంటనే నిలిపివేయాలని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. విద్యార్థులపై చేయి పడితే పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించింది.

మహబూబాబాద్ జిల్లాలో విద్యార్థుల పట్ల క్రూరంగా వ్యవహరించిన పోలీసు అధికారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ డీజీపీని బీఆర్ఎస్ కోరింది. విద్యార్థుల ఆందోళనలను అణచివేయడం కాకుండా వారితో చర్చించి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేసింది.

## తాజా వార్తలు

# బాలికల అక్రమ రవాణా కేసులో 33 మందికి శిక్షలు



ఐదుగురికి జీవిత ఖైదు..
మరో 28 మందికి వివిధ శిక్షలు
తొమ్మిది మంది బాధిత
బాలికలకు రూ.45 లక్షల పరిహారం
సీఐడీ మహిళా భద్రత విభాగం
దర్యాప్తుతో కీలక తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య): బాలికలను అక్రమంగా తరలించి వ్యభిచారంలోకి నెట్టడం, లైంగిక దోపిడీకి పాల్పడిన కేసులో 33 మంది నిందితులను దోషులుగా నిర్ధారిస్తూ హైదరాబాద్‌లోని హకా భవన్ పోక్సో ప్రత్యేక సెషన్స్ కోర్టు (ఎఫ్‌టీఎస్‌సీ) బుధవారం తీర్పు వెలువరించింది. ఐదుగురికి జీవిత ఖైదు విధించగా, మరో 28 మందికి వివిధ కాలపరిమితులతో కఠిన కారాగార శిక్షలు విధించింది.

సీఐడీ హైదరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో 2015లో నమోదైన క్రైం నంబర్ 14/2015 కేసులో సీఐడీ మహిళా భద్రత విభాగం దర్యాప్తు చేపట్టింది. పోక్సో చట్టం, ఐపీసీ, ఇమ్మోరల్ ట్రాఫిక్ (ప్రివెన్షన్) యాక్ట్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టంలోని పలు సెక్షన్ల కింద నిందితు-

మిగతాది 2 పేజీలో

# పేదల సొంతింటి కలకు సర్కారు భరోసా

హుజూర్‌నగర్‌లో ఉత్తమ్ కలల గృహ సముదాయం
రామస్వామిగుట్టలో 2,160 ఇళ్ల భారీ కాలనీ
సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభోత్సవానికి సన్నాహాలు
అర్హులకే ఇళ్లు.. రాజకీయ సిఫారసులకు తావులేదు: మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య): రాష్ట్రంలో నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పేదల గృహ అవసరాలను తీర్చడంలో విఫలమైందని, ప్రస్తుత ప్రభుత్వం అర్హుల గుర్తింపు నుంచి ఇళ్ల నిర్మాణం పూర్తి చేసే వరకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని అన్నారు.

బుధవారం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల అధికారులతో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్రవ్యాప్తంగా గృహ నిర్మాణ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణంలో ఎలాంటి జాప్యానికి తావివ్వకుండా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పేదలకు గౌరవప్రదమైన సొంతింటిని అందించడం కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన సంక్షేమ ప్రాధాన్యాల్లో ఒకటని స్పష్టం చేశారు.

### 2,160 ఇళ్ల భారీ కాలనీ

హుజూర్‌నగర్‌లోని రామస్వామిగుట్ట వద్ద నిర్మిస్తున్న 2,160 ఇళ్ల భారీ గృహ సముదాయాన్ని మంత్రి ఉత్తమ్ ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. కేవలం నాలుగు గోడలు, పైకప్పుతో కాకుండా పేద కుటుంబాలు గౌరవంగా జీవించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులతో ఈ కాలనీని ఆదర్శ గృహ సముదాయంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు.

రామస్వామిగుట్ట కాలనీ పనుల పురోగతిని సమీక్షించిన మంత్రి, సెప్టెంబర్ తొలి వారంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఆదేశించారు. మిగిలిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, లబ్ధిదారులు గృహప్రవేశం చేసే సమయానికి ఏ ఇంటిలోనూ లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు.

ప్రతి ఇంటినీ అధికారులు తనిఖీ చేసి తలుపులు, కిటికీలు, విద్యుత్, నీటి సరఫరా, బాత్‌రూమ్‌లు, డ్రైనేజీ తదితర మౌలిక వసతులు పూర్తిగా ఉన్నాయో లేదో నిర్ధారించాలని ఆదేశించారు. పెండింగ్ పనులను సాధ్యమైనంత వరకు ఏడు నుంచి పది రోజుల్లో పూర్తి చే-

మిగతాది 2 పేజీలో

# ఆయుష్ విద్యార్థుల పోరాటానికి బీజేపీ మద్దతు

ఎర్రగడ్డ ఆసుపత్రిలో విద్యార్థులతో రామ్‌చందర్‌రావు భేటీ
స్టైపెండ్ అసమానతలపై ఆందోళన వ్యక్తం

కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విమర్శలు

న్యాయమైన డిమాండ్లకు అండగా ఉంటామన్న హామీ



హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య): ఎర్రగడ్డలోని ఆయుర్వేద ఆసుపత్రిలో స్టైపెండ్ పెంపు కోసం ఆందోళన చేస్తున్న ఆయుష్ విద్యార్థులను తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామ్‌చందర్‌రావు బుధవారం కలిసి వారికి సంఘీభావం తెలిపారు. గత అనేక రోజులుగా కొనసాగుతున్న ఈ ఆందోళనలో పాల్గొన్న విద్యార్థుల సమస్యలను ఆయన నేరుగా అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల డిమాండ్లు న్యాయబద్ధమైనవేనని పేర్కొంటూ వారి పోరాటానికి భారతీయ జనతా పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయుష్ విద్యార్థులకు చెల్లిస్తున్న స్టైపెండ్ దాదాపు పదేళ్లకు పైగా గణనీయమైన పెంపు లేకుండానే కొనసాగుతోందని రామ్‌చందర్‌రావు అన్నారు. జీవన వ్యయాలు పెరిగినా, వైద్య విద్యలో ఖర్చులు అధికమైనా విద్యార్థుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోలేదని విమర్శించారు. విద్యార్థుల కష్టాలను అర్థం చేసుకుని వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అల్లోపతి విభాగంలోని విద్యార్థులతో పోలిస్తే ఆయుష్ విద్యార్థులకు అందుతున్న స్టైపెండ్ చాలా తక్కువగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే వైద్య సేవా రంగంలో పనిచేసే విద్యార్థుల మధ్య ఇంతటి వ్యత్యాసం ఉండటం సమంజసం కాదన్నారు. ముఖ్యంగా పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో ఆయుష్ వైద్యులకు దాదాపు అల్లోపతి విద్యార్థులతో సమాన స్థాయిలో స్టైపెండ్ అందుతోందని, తెలంగాణ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయుష్ విద్యార్థుల సమస్యలు కొత్తవి కావని, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా వాటిని పరిష్కరించడంలో విఫలమైందని రామ్‌చందర్‌రావు ఆరోపించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యార్థుల ఆందోళనను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పదహారు రోజులుగా విద్యార్థులు నిరసనలు కొనసాగిస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. వైద్య విద్యార్థుల సమస్యలను రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో చూడాలని ఆయన సూచించారు. రాష్ట్ర ఆరోగ్య రంగానికి సేవలందించే భవిష్యత్ వైద్యులను నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులను తగ్గించేందుకు స్టైపెండ్ పెంపుతో పాటు బకాయిలను కూడా వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళన చేస్తున్న ఆయుష్ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు బీజేపీ వారి వెంటే ఉంటుందని రామ్‌చందర్‌రావు స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైన ప్రతి వేదికపై వారి తరఫున పోరాడతామని చెప్పారు. ఆయుష్ వైద్య విద్యకు తగిన గౌరవం, ప్రోత్సాహం లభించేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని మరోసారి కోరారు.

## సంపాదకీయం

### అఖండ భారత్ – ఐక్యతే బలం

భారతదేశం అనేది కేవలం భౌగోళిక సరిహద్దులతో కూడిన దేశం కాదు. వేల సంవత్సరాల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, ఆధ్యాత్మిక విలువలతో ముడిపడిన మహోన్నత నాగరికత. విభజనలు ఎన్నో ఎదురైనా భారతీయుల హృదయాల్లో ఉన్న సాంస్కృతిక ఐక్యత చెదరలేదు. “అఖండ భారత్” అనే భావనను రాజకీయ విస్తరణగా కాకుండా, భారత ఉపఖండ ప్రజల మధ్య చారిత్రక, సాంస్కృతిక, మానవీయ బంధాలను గుర్తుచేసే ఆలోచనగా చూడాలి.

భిన్నత్వంలో ఏకత్వం భారతదేశానికి ఉన్న అతి పెద్ద బలం. మతం, భాష, ప్రాంతం, కులం వంటి భేదాలను అధిగమించి దేశ సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత. పొరుగు దేశాలతో శాంతి, స్నేహం, పరస్పర గౌరవం పెంపొందించుకోవడం కూడా ఈ భావనకు బలాన్నిస్తుంది.

అఖండ భారత్ ఆకాంక్ష కంటే ముందుగా అఖండ భారతీయ చైతన్యం అవసరం. దేశ ఐక్యత, సార్వభౌమత్వం, ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ భవిష్యత్ తరాలకు బలమైన, సమగ్ర భారతదేశాన్ని అందించడమే మన నిజమైన లక్ష్యం.

# భూత్పూర్ సబ్‌స్టేషన్‌పై సీఎండీ సమీక్ష

### జితేష్ వి. పాటిల్ ఆకస్మిక తనిఖీ
### విద్యుత్ సరఫరా నాణ్యతపై ఆరా
### లోడ్ నిర్వహణపై కీలక ఆదేశాలు



**మహబూబ్‌నగర్, ఆగస్టు 19 (వార్త సంధ్య):** మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను టీజీఎస్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో కలిసి సబ్‌స్టేషన్‌ను సందర్శించిన ఆయన విద్యుత్ సరఫరా పరిస్థితులు, వినియోగదారులకు అందుతున్న సేవలు, సాంకేతిక నిర్వహణ అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థ పనితీరును నేరుగా పరిశీలిస్తూ అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్‌పై ప్రస్తుతం ఉన్న విద్యుత్ లోడ్, గరిష్ట డిమాండ్ సమయాల్లో తీసుకుంటున్న చర్యలు, విద్యుత్ సరఫరా సామర్థ్య ం, భవిష్యత్ అవసరాలను ఎదుర్కొనే సన్నద్ధత వంటి అంశాలపై సీఎండీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని దృష్టిలో ఉంచుకుని పంపిణీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఎన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతోందో, ఆయా ప్రాంతాల్లో తక్కువ వోల్టేజీ, తరచూ విద్యుత్ అంతరాయాలు లేదా ఇతర సాంకేతిక సమస్యలు ఉన్నాయా అనే విషయాలపై అధికారులు సీఎండీకి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అవసరాలు, గృహ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొనకుండా సకాలంలో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్లు, ఫీడర్ల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని జితేష్ వి. పాటిల్ అధికారులకు సూచించారు. ప్రతి ఫీడర్ పనితీరును క్రమం తప్పకుండా సమీక్షిస్తూ లోపాలను వెంటనే గుర్తించి పరిష్కరించాలని చెప్పారు. నిర్వహణ పనులను ఆలస్యం చేయకుండా పూర్తి చేయడం ద్వారా విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచవచ్చని అభిప్రాయపడ్డారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ, సురక్షిత విద్యుత్ సరఫరా అందించడమే సంస్థ ప్రధాన లక్ష్యమని సీఎండీ స్పష్టం చేశారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి సేవలను మరింత మెరుగుపరచాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ అవసరాలు వేగంగా పెరుగుతున్నందున భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల విద్యుత్ సరఫరా పరిస్థితులు, లోడ్ వివరాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాంకేతిక సమస్యలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై అధికారులు సీఎండీకి సమగ్ర నివేదిక అందించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న చర్యలపై కూడా చర్చించారు. ఈ తనిఖీలో టీజీఎస్పీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ భీమనాయక్, డివిజనల్ ఇంజనీర్ చంద్రమౌళి, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# బాలికల అక్రమ రవాణా కేసులో 33 మందికి శిక్షలు

లపై అభియోగాలు నమోదయ్యాయి.

### ఉద్యోగం పేరుతో మోసం

2015 జూలై 17న బాధితురాలు సీఐడీని ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఆమెను కొందరు నిందితులకు పరిచయం చేసి వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొంది. అనంతరం ఆమెను బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టడంతోపాటు లైంగిక దోపిడీకి గురిచేసినట్లు తెలిపింది.

సుమారు నాలుగు నెలల పాటు నిందితుల నియంత్రణలో ఉన్న బాధితురాలు వారి నుంచి తప్పించుకుని సీఐడీ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. పోలీసులు పలు ప్రాంతాల్లో దాడులు నిర్వహించి తొమ్మిది మంది మైనర్ బాలికలను సహా పలువురు బాధితులను రక్షించారు. నేరానికి సంబంధించిన ఆధారాలను స్వాధీనం చేసుకుని సమగ్ర దర్యాప్తు అనంతరం ఛార్జిషీట్ దాఖలు చేశారు.

### శిక్షలు ఇలా..

ప్రత్యేక సెషన్స్ జడ్జి శ్రీ ఉదయ్ భాస్కర్‌రావు విచారణ అనంతరం 33 మంది నిందితులను దోషులుగా నిర్ధారించారు.

ఐదుగురికి జీవిత ఖైదు
ముగ్గురికి 14 ఏళ్ల కఠిన కారాగార శిక్ష
14 మందికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష
11 మందికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష
బాధిత బాలికలకు రూ.45 లక్షల పరిహారం

నిందితుల చర్యల కారణంగా శారీరక, మానసిక వేదనకు గురైన తొమ్మిది మంది బాధిత బాలికలకు ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.45 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది. చట్ట ప్రకారం ఇప్పటికే అందిన పరిహారానికి అదనంగా ఈ మొత్తాన్ని చెల్లించాలని పేర్కొంది. పరిహారం చెల్లింపు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శిని ఆదేశించింది.

ఈ కేసులో డీఎస్పీలు సురేశ్‌బాబు, కె. శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ కె. బాలరాం రెడ్డి దర్యాప్తు అధికారులుగా వ్యవహరించారు. ప్రభుత్వ న్యాయవాది, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మరెల్ల రమాదేవి కేసును వాదించారు.

మహిళలు, బాలికల అక్రమ రవాణా, లైంగిక దోపిడీ వంటి తీవ్రమైన నేరాల్లో సమర్థవంతమైన దర్యాప్తు, ప్రాసిక్యూషన్‌తో నిందితులకు శిక్షలు పడేలా చేసిన ఈ తీర్పు కీలకమని సీఐడీ మహిళా భద్రత విభాగం పేర్కొంది. బాధితులకు రక్షణ, పునరావాసం, పరిహారం అందించడంతోపాటు నేరస్థులను చట్టం ముందు నిలబెట్టడమే తమ లక్ష్యమని స్పష్టం చేసింది.



# కాంగ్రెస్‌లో క్రమశిక్షణ కొరడా!

### ఎల్బీనగర్ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి సస్పెన్షన్
### కులాల పేరుతో దూషణల ఆరోపణలపై చర్యలు
### కొండా సురేఖ, చిన్నారెడ్డికి మూడు రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం



**హైదరాబాద్, ఆగస్టు 20 (వార్త సంధ్య):** తెలంగాణ కాంగ్రెస్‌లో పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనకు సంబంధించి టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎల్బీనగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జక్కిడి ప్రభాకర్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ కమిటీ ఆదేశాలు జారీ చేసింది.

పలువురిని వ్యక్తిగత విషయాలపై దూషించడంతో పాటు కులాల పేరుతో అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు వచ్చిన ఆరోపణలకు సంబంధించి సరైన ఆధారాలు ఉన్నాయని క్రమశిక్షణ కమిటీ పేర్కొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు ప్రభాకర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు వేసినట్లు తెలిపింది.

**కొండా సురేఖకు మూడు రోజుల గడువు**

మరోవైపు దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖకు కూడా టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. మంత్రి కుమార్తె కొండా సుస్మిత పరకాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీనియర్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

ఈ వ్యవహారంపై మూడు రోజుల్లోగా వివరణ సమర్పించాలని మంత్రి కొండా సురేఖను క్రమశిక్షణ కమిటీ ఆదేశించినట్లు సమాచారం.

**చిన్నారెడ్డికి కూడా నోటీసులు**

మాజీ మంత్రి, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి కూడా టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. ఇటీవల వనపర్తి నియోజకవర్గంలో జరిగిన సభలో పార్టీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలు, స్థానిక ఎమ్మెల్యేపై చేసిన అనుచిత ప్రసంగంపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది.

**చిన్నారెడ్డి కూడా మూడు రోజుల్లోగా తన వివరణ ఇవ్వాలని కమిటీ స్పష్టం చేసింది.**

ఒకే సమయంలో ఓ సీనియర్ నేతను సస్పెండ్ చేయడంతోపాటు ఇద్దరు కీలక నేతలకు వి వ ర ణ కోరుతూ నోటీసులు జారీ కావడం తెలంగాణ కాంగ్రెస్‌లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించే నేతలపై ఇకపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్న సంకేతాలు ఈ పరిణామాలతో వెలువడుతున్నాయి.

# ఏఐ శిక్షణ కోసం గూగుల్ భారీ డేటా కొనుగోలు




**న్యూయార్క్, ఆగస్టు 19 (వార్త సంధ్య ):** కృత్రిమ మేధ నమూనాలకు మరింత మెరుగైన శిక్షణ అందించేందుకు గూగుల్ భారీగా ఖర్చు చేస్తోంది. ఇటీవల కార్యకలాపాలు నిలిపివేసిన అమెరికా బడ్జెట్ విమానయాన సంస్థ స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన భారీ డేటాను సుమారు 10 మిలియన్ డాలర్లకు కొనుగోలు చేసినట్లు సమాచారం. భారత కరెన్సీలో ఇది దాదాపు రూ.95 కోట్లకు సమానం. కోర్టు పర్యవేక్షణలో జరిగిన ఆస్తుల వేలంలో మరో కృత్రిమ మేధ సంస్థను వెనక్కి నెట్టి గూగుల్ ఈ సమాచారాన్ని దక్కించుకుంది.

**అరుదైన సమాచారంపై టెక్ సంస్థల కన్ను**

కృత్రిమ మేధ నమూనాలను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఇంటర్నెట్‌లో సాధారణంగా లభించని ప్రత్యేక సమాచారాన్ని సేకరించడంపై సాంకేతిక సంస్థలు దృష్టి సారిస్తున్నాయి. సంస్థలు ఏళ్ల తరబడి భద్రపరిచిన అంతర్గత పత్రాలు, పాత రికార్డులు, వ్యాపార సమాచారాన్ని కృత్రిమ మేధ శిక్షణకు ఉపయోగించుకునే అవకాశాలపై పరిశోధనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన డేటా గూగుల్‌కు కీలకంగా మారింది.

**కోట్లాది పత్రాలు.. భారీ సమాచార భాండాగారం**

ఈ ఒప్పందం ద్వారా గూగుల్‌కు స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌కు సంబంధించిన భారీ స్థాయిలో అంతర్గత సమాచారం అందుబాటులోకి రానుంది. ఇందులో సుమారు 10 కోట్ల ఈమెయిళ్లు, 50 కోట్ల మైక్రోసాఫ్ట్ టీమ్స్ సంభాషణలు, ప్రాజెక్టు నిర్వహణ వివరాలు, దాదాపు 3 కోట్ల పంక్తుల సాఫ్ట్‌వేర్ కోడ్ ఉన్నట్లు సమాచారం.
దీనితో పాటు ఇతర విమానయాన సంస్థలకు సంబంధించిన సుమారు 720 కోట్ల విమాన ధరల వివరాలు కూడా గూగుల్ చేతికి వెళ్లనున్నాయి. దాదాపు రెండు దశాబ్దాలుగా సేకరించిన ఈ సమాచారం విమానయాన రంగంలోని ధరలు, మార్కెట్ ధోరణులు, పోటీ

# పేదల సొంతింటి కలకు సర్కారు భరోసా

(మొదటి పేజీ తరువాయి..)

యాలని గడువు విధించారు.

**అర్హులకే ఇళ్లు**



లబ్ధిదారుల ఎంపికలో పూర్తి పారదర్శకత పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. “ఒక్క అనర్హుడికీ ఇల్లు దక్కకూడదు. అదే సమయంలో నిజంగా అర్హత ఉన్న ఒక్క నిరుపేద కుటుంబం కూడా నష్టపోకూడదు. రాజకీయ సిఫారసులు అర్హతను అధిగమించలేవు” అని తేల్చిచెప్పారు.

పెండింగ్ జాబితాలను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి సొంతిల్లు లేని బీపీఎల్ కుటుంబాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అర్హులైన దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

**సంపూర్ణ నివాస కాలనీగా అభివృద్ధి**

రామస్వామిగుట్టను కేవలం ఇళ్ల సముదాయంగా కాకుండా సంపూర్ణ నివాస కాలనీగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అంతర్గత రహదారులు, పచ్చదనం, పాఠశాల, కమ్యూనిటీ హాల్, సామూహిక మరుగుదొడ్లు, రీడింగ్ రూమ్‌లు తదితర సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. పాఠశాల నిర్మాణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, మిగిలిన సామాజిక మౌలిక వసతుల పనులను వేగవంతం చేయాలని సూచించారు.

కాలనీ పరిసరాల్లో ఇప్పటికే దాదాపు 10 వేల అదనపు మొక్కలు నాటినట్లు అధికారులు మంత్రికి వివరించారు. మిగిలిన మొక్కల పెంపకం, ల్యాండ్‌స్కేపింగ్ పనులను పూర్తి చేయడంతోపాటు వాటి సంరక్షణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

“పేదవాడికి ఇల్లు అంటే కేవలం ఒక నిర్మాణం కాదు.. అది ఒక కుటుంబానికి భద్రత, ఆత్మగౌరవం, భవిష్యత్తుపై భరోసా. రామస్వామిగుట్ట కాలనీ ఆ భావనకు ప్రతిరూపంగా నిలవాలి” అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# మారుతున్న సవాళ్లకు అనుగుణంగా పోలీసు సిబ్బంది పునర్వ్యవస్థీకరణ: డిజిపి సి. వి. ఆనంద్

**– ట్రాఫిక్, రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం**

**- గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ నుంచి 513 మంది ఇతర విభాగాలకు బదిలీ**

**- డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్‌పై ప్రత్యేక దృష్టి**

హైదరాబాద్, ఆగస్టు 19 ( వార్త సంధ్య ):

మారుతున్న నేర స్వభావం, ప్రజా భద్రతకు ఎదురవుతున్న కొత్త సవాళ్లకు అనుగుణంగా తెలంగాణ పోలీసు శాఖలో మానవ వనరులను పునర్వ్యవస్థీకరిస్తున్నట్లు తెలంగాణ పోలీస్ అకాడమీ లో బుధ వారం జరిగిన సమావేశంలో డిజిపి సి. వి. ఆనంద్ తెలిపారు. ఒకప్పుడు వామపక్ష తీవ్రవాదం, ఉగ్రవాదం ప్రధాన సవాళ్లుగా ఉండగా.. ప్రస్తుతం డ్రగ్స్, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత, ఆహార కల్తీ వంటి అంశాలు పోలీసులకు కొత్త సవాళ్లుగా మారాయని చెప్పారు.

513 మందికి కొత్త బాధ్యతలు

గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ఎస్ఐబీ తదితర ప్రత్యేక విభాగాల నుంచి 513 మంది సిబ్బందిని ఎనిమిది విభాగాలకు అవసరాలకు అనుగుణంగా కేటాయించారు. వీరిలో ఐదుగురు ఇన్‌స్పెక్టర్లు, 22 మంది ఎస్ఐలు, 14 మంది ఏఎస్ఐలు, 84 మంది హెడ్ కానిస్టేబుళ్లు, 388 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు.

అత్యధికంగా 224 మందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు భద్రత విభాగానికి కేటాయించారు. ఆహార కల్తీ, డ్రగ్ కంట్రోల్‌కు 80 మంది, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు 79 మంది, సివిల్ సప్లయిస్‌కు 28 మంది, డిజిపి కార్యాలయం–టి-స్పార్క్‌కు 27 మంది, ఏసీబీ, సీఐడీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు 25 మంది చొప్పున కేటాయించారు.

రెండు నెలల అటాచ్‌మెంట్ తర్వాత..

కొత్త బాధ్యతలు అప్పగించే ముందు సిబ్బందిని వివిధ విభాగాల్లో రెండు నెలల పాటు అటాచ్‌మెంట్‌పై పనిచేయించామని డిజిపి తెలిపారు. ప్రభుత్వ అనుమతితో ఆయా విభాగాల్లో పోస్టుల ఏర్పాటు ఆధారంగా తుది కేటాయింపులు చేశామన్నారు. సిబ్బంది విద్యార్హతలు, అనుభవం, నేపథ్యాన్ని పరిశీలించడంతో పాటు వ్యక్తిగతంగా ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు చెప్పారు. కొత్త విభాగాల విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ పోలీస్ అకాడమీలో 11 రోజుల ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు.



తీవ్రవాదం నుంచి సైబర్ నేరాల వరకు..

తెలంగాణలో 1980, 1990 దశకాల్లో వామపక్ష తీవ్రవాదం తీవ్రంగా ఉండేదని డీజీపీ గుర్తుచేశారు. అప్పటి పరిస్థితుల్లో ప్రత్యేక పోలీసు బలగం అవసరమై 1987లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు హయాంలో కేఎస్ వ్యాస్ నేతృత్వంలో ప్రత్యేక విభాగం ఏర్పడిందని తెలిపారు. అదే క్రమంలో గ్రేహౌండ్స్ రూపుదిద్దుకుందని చెప్పారు. గ్రేహౌండ్స్, ఎస్ఐబీ తదితర విభాగాలు మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నారు.

2017 తర్వాత తెలంగాణలో మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గాయని, అయితే ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ తదితర రాష్ట్రాల్లో కార్యకలాపాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇటీవల కర్రెగుట్టల ప్రాంతాన్ని సందర్శించిన సందర్భంగా అక్కడ మౌలిక వసతుల కొరత స్పష్టంగా కనిపించిందని, కొన్ని ప్రాంతాల్లో రహదారులు, పాఠశాలలు, వైద్య సదుపాయాలు ఇంకా మెరుగుపడాల్సి ఉందన్నారు.

2007లో హైదరాబాద్‌లో లుంబినీ పార్క్, చార్మినార్ ప్రాంతాల్లో జరిగిన ఉగ్రదాడుల నేపథ్యంలో ప్రత్యేక కౌంటర్ టెర్రరిజం సామర్థ్యాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఏర్పడిందని, దాని ఫలితంగా ఆక్టోపస్ వంటి ప్రత్యేక విభాగాలు అభివృద్ధి చెందాయని డిజిపి వివరించారు.

విద్యార్థులపై డ్రగ్స్ పంజా

యువతలో డ్రగ్స్ వినియోగం పెరుగుతుండటం ఆందోళన కలిగించే అంశమని డిజిపి సి వి ఆనంద్ అన్నారు. గతేడాది 835 మంది విద్యార్థుల్లో డ్రగ్స్ ఆనవాళ్లు గుర్తించినట్లు తెలిపారు. మరో విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అధ్యయనంలో సుమారు 70 శాతం మంది విద్యార్థులు డ్రగ్స్‌కు గురైనట్లు తేలిందని చెప్పారు. డ్రగ్స్ సరఫరా గొలుసును పూర్తిగా అడ్డుకోవడంతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లలను ఇప్పుడే కాపాడుకోకపోతే భవిష్యత్తులో పరిస్థితి మరింత తీవ్రంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

సైబర్ నేరాల్లో రూ.1,750 కోట్ల నష్టం

సైబర్ నేరాలు మరో ప్రధాన సవాలుగా మారాయని డిజిపి తెలిపారు. ఆన్‌లైన్ బెట్టింగ్, పెట్టుబడి మోసాలు, నకిలీ యాప్‌ల ద్వారా మోసాలు పెరుగుతున్నాయని చెప్పారు. గత ఏడాది తెలంగాణలో సైబర్ నేరాల కారణంగా సుమారు రూ.1,750 కోట్ల ఆర్థిక నష్టం జరిగినట్లు తెలిపారు. సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక విభాగాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

రోడ్డు భద్రతకు పెద్దపీట

తాజా పునర్వ్యవస్థీకరణలో రోడ్డు భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు డీజీపీ తెలిపారు. గత ఏడాది తెలంగాణలో రోడ్డు ప్రమాదాల్లో సుమారు 8 వేల మంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, అమలును మరింత బలోపేతం చేసేందుకు 224 మంది సిబ్బందిని ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్డు సేఫ్టీ విభాగానికి కేటాయించినటు తెలిపారు.



ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి వాటికి సంబంధించిన ఇంజినీరింగ్ లోపాలను సరిదిద్దేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక రోడ్డు భద్రత కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

కొత్త బాధ్యతలు స్వీకరిస్తున్న సిబ్బంది నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహించాలని డీజీపీ సూచించారు. శారీరక దారుఢ్యాన్ని కాపాడుకోవడంతో పాటు విధుల్లో నిర్లక్ష్యానికి తావివ్వకూడదన్నారు. కొత్త బాధ్యతలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకుని క్రమశిక్షణతో, వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని సూచించారు.

గ్రేహౌండ్స్, ఆక్టోపస్ విభాగాల్లో ఫీల్డ్ ఆపరేషన్లు, నిర్వహణ, శిక్షణ తదితర అవసరాలకు సరిపడా సిబ్బందిని కొనసాగించినట్లు డిజిపి తెలిపారు. మూడు నెలల అనంతరం సిబ్బంది అవసరాలు, పనితీరును మరోసారి సమీక్షిస్తామని వెల్లడించారు.

---

# పరకాల టికెట్‌పై కాంగ్రెస్‌లో కలకలం!

సీఎం వ్యాఖ్యలపై సుష్మిత అభ్యంతరం

కొండా మురళికి అన్యాయం జరుగుతోందంటూ ఆరోపణలు

సుష్మిత వ్యాఖ్యలపై నివేదిక కోరిన పార్టీ నాయకత్వం

క్రమశిక్షణ చర్యలపై హెచ్చరిక



**హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య):** తెలంగాణ కాంగ్రెస్‌లో పరకాల అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ అంశం మరోసారి రాజకీయ వేడిని రేపింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ కుమార్తె కొండా సుష్మిత తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ఇంకా సమయం ఉండగానే అభ్యర్థిత్వంపై ఎలా ప్రకటన చేస్తారని ఆమె ప్రశ్నించారు.



కాంగ్రెస్‌లో అభ్యర్థుల ఎంపిక అధిష్ఠానం పరిధిలోని అంశమని, స్థానిక పరిస్థితులు, ప్రజల అభిప్రాయం, నాయకుల పనితీరు తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని సుష్మిత పేర్కొన్నారు.

కొండా మురళికి అన్యాయం జరుగుతోందా?

తన తండ్రి కొండా మురళికి పార్టీ నాయకత్వం తగిన గుర్తింపు ఇవ్వడం లేదని సుష్మిత ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి పీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని తొలినాళ్లలో కొండా దంపతులు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా, రాకపోయినా కొండా మురళికి ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారని, అయితే ఇప్పటి వరకు ఆ హామీ అమలు కాలేదని ఆమె పేర్కొన్నారు.

పరకాల విషయంలో ముందుగానే అభ్యర్థిత్వంపై ప్రకటనలు చేయడం, ఇతర నియోజకవర్గాల విషయంలో అధిష్ఠానం నిర్ణయమే తుది నిర్ణయమని చెప్పడం మధ్య వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు. యువతకు అవకాశాలు కల్పించాలని చెబుతూనే ఇప్పటికే పదవుల్లో ఉన్నవారికే మరోసారి టికెట్లు ఇస్తామని ప్రకటించడం సరైన విధానం కాదని విమర్శించారు.

బీసీలకు ప్రాధాన్యం లేదని ఆరోపణ

రాజకీయాల్లో సామాజిక సమతుల్యత అవసరమని సుష్మిత పేర్కొంటూ, బీసీ వర్గాలకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదని ఆరోపించారు. రాష్ట్ర రాజకీయాల్లో కొందరు నేతలు అధిక ప్రభావం చూపుతున్నారంటూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిపైనా ఆమె విమర్శలు చేశారు.

తన వ్యాఖ్యలపై ఎవరైనా స్పందిస్తే మరిన్ని విషయాలను బయటపెడతానంటూ సుష్మిత చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ వర్గాల్లో మరింత చర్చకు దారితీశాయి.

నివేదిక కోరిన పార్టీ నాయకత్వం

సుష్మిత వ్యాఖ్యలపై కాంగ్రెస్ క్రమశిక్షణా కమిటీ చైర్మన్ మల్లు రవి స్పందించారు. పార్టీ క్రమశిక్షణకు విరుద్ధంగా, ముఖ్యమంత్రి ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సేకరించిన తర్వాత తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ కూడా ఈ వ్యవహారంపై పూర్తి నివేదిక కోరినట్లు సమాచారం. పార్టీ నాయకత్వం నివేదికను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

అధిష్ఠానం నిర్ణయమే తుది నిర్ణయం

మరోవైపు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఈ వివాదంపై స్పందిస్తూ, పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే అందరికీ శిరోధార్యమని పేర్కొన్నారు. అనవసర రాజకీయ వివాదాల్లో తాను పాల్గొనబోనని స్పష్టం చేశారు.

పరకాల టికెట్ అంశంతో మొదలైన వివాదం ఇప్పుడు పార్టీ అంతర్గత వ్యవహారాలు,

---

# కేబీఆర్ వన్‌వేతో ట్రాఫిక్ తిప్పలు

- కొత్త ట్రాఫిక్ విధానంతో వాహనదారుల ఇబ్బందులు
- జూబ్లీహిల్స్, బంజారాహిల్స్‌లో భారీ రద్దీ
- ప్రయాణ సమయం మూడు రెట్లు పెరిగిన పరిస్థితి

**హైదరాబాద్, ఆగస్టు 19 ((వార్త సంధ్య ):** హైదరాబాద్‌లో కేబీఆర్ పార్క్ పరిసర ప్రాంతాల్లో అమలు చేసిన కొత్త వన్‌వే ట్రాఫిక్ విధానం మొదటి రోజే వాహనదారులకు చుక్కలు చూపించింది. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో ప్రధాన రహదారులపై భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రయాణికులు గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం కేబీఆర్ పార్క్ చుట్టూ కొత్త వన్‌వే విధానాన్ని అధికారులు అమలు చేశారు. అయితే కొత్త మార్గాలపై పూర్తి అవగాహన లేకపోవడం, ప్రత్యామ్నాయ రహదారులపై వాహనాల ఒత్తిడి పెరగడం వల్ల అనేక కూడళ్ల వద్ద ట్రాఫిక్ స్తంభించింది. ముఖ్యంగా రోడ్ నంబర్ 10, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, బంజారాహిల్స్ ప్రధాన మార్గాల్లో రద్దీ తీవ్రంగా కనిపించింది.



సాధారణంగా 10 నుంచి 15 నిమిషాల్లో పూర్తయ్యే ప్రయాణానికి 40 నుంచి 45 నిమిషాల వరకు సమయం పట్టినట్లు ప్రయాణికులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో వాహనాల సగటు వేగం గణనీయంగా తగ్గిపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా మారింది.

అయితే ఇది ప్రారంభ దశలో ఎదురయ్యే సాధారణ సమస్య మాత్రమేనని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. కొత్త విధానానికి ప్రజలు అలవాటు పడిన తర్వాత ట్రాఫిక్ ప్రవాహం మెరుగుపడుతుందని, రద్దీ తగ్గే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన మార్పులు చేపడతామని వెల్లడించారు.

ప్రస్తుతం కేబీఆర్ పార్క్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని, ప్రయాణానికి అదనపు సమయం కేటాయించాలని ట్రాఫిక్ శాఖ సూచించింది. నగరంలో పెరుగుతున్న వాహనాల సంఖ్యకు అనుగుణంగా ట్రాఫిక్ నిర్వహణలో కొత్త విధానాలను అమలు

# జూద స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం

**అక్రమ కార్యకలాపాలపై విస్తృత దాడులు**

**జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక నిఘా**

**నిందితులపై కఠిన చర్యలకు హెచ్చరిక**

**చట్టవ్యతిరేక కార్యకలాపాల నిర్మూలనే లక్ష్యం**



**బాపట్ల, ఆగస్టు 19 (వార్త సంధ్య ):** జిల్లాలో అక్రమ జూద కార్యకలాపాలపై బాపట్ల జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి జూద స్థావరాలపై విస్తృత స్థాయిలో దాడులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ జూద కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకునే ప్రక్రియను మరింత వేగవంతం చేశారు. ప్రజల శాంతిభద్రతలకు భంగం కలిగించే జూదం, ఇతర అక్రమ కార్యకలాపాలపై ఎలాంటి రాజీ ఉండదని పోలీసు అధికారులు స్పష్టం చేశారు. జూద స్థావరాలను నిర్వహించే వారితో పాటు వాటిలో పాల్గొనే వారిపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు చట్టాన్ని గౌరవించి వెంటనే వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల సహకారంతో జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలను పూర్తిగా నిర్మూలించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని బాపట్ల జిల్లా పోలీసులు వెల్లడించారు.

# అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్‌లో తెలంగాణ యువకుడి సత్తా



**హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య ) :** దక్షిణాఫ్రికాలోని సన్ సిటీ వేదికగా జరిగిన ప్రపంచ సబ్-జూనియర్, జూనియర్ క్లాసిక్ అండ్ ఇక్విప్డ్ పవర్‌లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు చెందిన మోదెం వంశీ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. జూనియర్ 66 కిలోల విభాగంలో పోటీపడిన వంశీ ఏకంగా నాలుగు పతకాలు సాధించి అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాడు.

ఇందులో రెండు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్య పతకం ఉన్నాయి. స్క్వాట్, డెడ్‌లిఫ్ట్‌లో స్వర్ణాలు స్క్వాట్ విభాగంలో 287.5 కిలోల బరువు ఎత్తి వంశీ స్వర్ణ పతకాన్ని సొంతం చేసుకున్నాడు. డెడ్‌లిఫ్ట్‌లోనూ 255 కిలోల బరువు ఎత్తి మరో స్వర్ణాన్ని కైవసం చేసుకున్నాడు. బెంచ్ ప్రెస్‌లో 145 కిలోలు ఎత్తి కాంస్య పతకం సాధించాడు.

ఓవరాల్‌లో రజత పతకం మూడు విభాగాల్లో కలిపి మొత్తం 687.5 కిలోల బరువు ఎత్తిన వంశీ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించాడు. 697.5 కిలోలతో అమెరికాకు చెందిన బ్రాడీ ప్రైస్ స్వర్ణం గెలుచుకోగా, జపాన్‌కు చెందిన రుయుచి ఇనుబుషి కాంస్య పతకం దక్కించుకున్నాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన మోదెం వంశీ ప్రస్తుతం హైదరాబాద్‌లోని లాల్ బహదూర్ శాస్త్రి స్టేడియంలో శిక్షణ పొందుతున్నాడు.

# ప్రతి ఊరికి సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప స్ఫూర్తిని తీసుకెళ్లాలి

**ప్రతి గడపకూ పాంచజన్య పథకాలను చేర్చాలి**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**




**హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య):** ప్రతి ఊరికి సామాజిక న్యాయ తెలంగాణ సంకల్పాన్ని తీసుకెళ్లాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. బుధవారం బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన కార్యాలయంలో పార్టీ పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌చార్జీలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సామాజిక న్యాయ తెలంగాణ సాధన కోసం ఆచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకుని ప్రతిజ్ఞ తీసుకున్నామని తెలిపారు. ఆ సంకల్ప స్ఫూర్తిని ప్రతి గ్రామానికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో అత్యధిక జనాభా ఉన్న వర్గాలు ఇప్పటికీ అట్టడుగున జీవించాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో, ఎనిమిది దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో సమానత్వం ఎందుకు ఇంకా అందని ద్రాక్షగా మారిందో ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు.

సామాజిక అసమానతలను రూపుమాపేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కవిత పిలుపునిచ్చారు. తొలిదశలో అన్ని మండల కేంద్రాలతోపాటు ప్రధాన గ్రామ పంచాయతీల్లో సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ప్రతి గ్రామంలో సభలు నిర్వహిస్తామని చెప్పారు.

పార్టీ ప్రధాన ఎజెండాగా పేర్కొంటున్న పాంచజన్య పథకాలను ప్రతి గడపకు చేర్చాలని పార్టీ శ్రేణులకు సూచించారు. సాధించుకున్న భౌగోళిక తెలంగాణను సబ్బండ వర్గాల అభివృద్ధి, వికాసం, సాధికారత సాధించిన సుసంపన్న తెలంగాణగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం తరహాలో సామాజిక న్యాయం కోసం మరో ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం పార్టీ క్యాడర్ సమాయత్తం కావాలని కవిత పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి ఎమ్మెల్యే భరోసా

**ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న గూడెం మహిపాల్ రెడ్డి**

**ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచన**

**వృత్తి అభివృద్ధికి అన్ని విధాలా సహకారం**

**పటాన్చెరు, ఆగస్టు 19 (వార్త సంధ్య ):** నియోజకవర్గంలోని ఫోటోగ్రాఫర్ల సంక్షేమానికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రొఫెషనల్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ పటాన్చెరు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పటాన్చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేక్ కట్ చేసి ఫోటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫోటోగ్రఫీ రంగం సమాజంలో కీలక పాత్ర పోషిస్తోందని, చారిత్రక సంఘటనలను, సామాజిక పరిణామాలను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ఫోటోగ్రాఫర్లపై ఉందని పేర్కొన్నారు.



ఫోటోగ్రఫీ రంగంలో వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడం ఎంతో అవసరమని ఎమ్మెల్యే సూచించారు. ఆధునిక కెమెరాలు, డిజిటల్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు ఆధారిత పద్ధతులను వినియోగించుకుంటేనే ఈ రంగంలో మరింత అవకాశాలు లభిస్తాయని అన్నారు. వృత్తిపరంగా ఎదగాలంటే నిరంతరం కొత్త నైపుణ్యాలను నేర్చుకోవాలని, సాంకేతిక మార్పులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని ఫోటోగ్రాఫర్లకు సూచించారు. ఫోటోగ్రఫీ కేవలం వృత్తి మాత్రమే కాకుండా ఒక కళ అని, దానిని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఫోటోగ్రాఫర్ల సంక్షేమం, వృత్తి అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని గూడెం మహిపాల్ రెడ్డి హామీ

# మహిళల భద్రతకు సమగ్ర కార్యాచరణ

**సురక్షిత ములుగు లక్ష్యంగా నిర్భయ ఫండ్ కమిటీ సమావేశం**

**ములుగు, ఆగస్టు 19 (వార్త సంధ్య):** మహిళలు, బాలికలకు సురక్షిత వాతావరణం కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా సమీకృత కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా నిర్భయ ఫండ్ కమిటీ సమావేశంలో మహిళల భద్రత, సంక్షేమం, సౌకర్యాల మెరుగుదలపై విస్తృతంగా చర్చించారు. నిర్భయ ఫండ్ ఆధ్వర్యంలో పైలట్ ప్రాజెక్టుగా చేపడుతున్న "మహిళలు, బాలికల కోసం సమ్మిళిత నగరాలు" కార్యక్రమం లక్ష్యాలన సమావేశంలో వివరించారు. మహిళలు, బాలికల సురక్షితంగా జీవించేందుకు, చదువుకునేందుకు ఉద్యోగాలు చేసేందుకు, స్వేచ్ఛగా ప్రయాణించేందుక అనుకూలమైన పట్టణ వాతావరణాన్ని సృష్టించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు మహిళలు తరచుగా ఎదుర్కొంటున్న భద్రత రవాణా, ప్రజా ప్రదేశాల వినియోగం, పారిశుద్ధ్య ఆరోగ్యం, విద్య, ఉపాధి, నిర్ణయాధికారం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు. మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే విధంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. స్థానిక సంఘాలు, ప్రభుత్వ శాఖలు, పౌరసంఘాలు, ఇతర భాగస్వామ్య సంస్థలు కలిసి పనిచేస్తూ మహిళలు, బాలికలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఆచరణాత్మక పరిష్కారాలను అమలు చేయనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ప్రజా మౌలిక సదుపాయాల మెరుగుదల, భద్రతా వ్యవస్థల బలోపేతం, మహిళలకు అందుబాటు సౌకర్యాల విస్తరణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళల భాగస్వామ్యాన్ని పట్టణ ప్రణాళిక, పాలన వ్యవస్థల్లో పెంచడంతో పాటు వారి నైపుణ్యాభివృద్ధికి



అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన అవసరాలను గుర్తించి ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, డీఎస్పీ కిషోర్ కుమార్, జిల్లా రవాణా అధికారి తాకూర్ ఈశ్వర్ సింగ్, ములుగు మున్సిపల్ కమిషనర్ సంపత్, పర్యాటక శాఖ

# ఎస్సీ యాక్షన్ ప్లాన్ లక్ష్యాలు త్వరగా పూర్తి చేయాలి

**సబిసిడీ రుణాల లబిధ్దారుల ఎంపిక వేగవంతం చేయాలని ఆదేశం**

**ఎసీస్ రైతులకు బోర్‌వెలన్ ఏరాప్టు చేయాలని సూచన**

**పెద్దపల్లి, ఆగస్టు 18 (వార్త సంధ్య):** జిల్లాలో ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్, పీఎం అజయ్ పథకం, ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, సంక్షేమ వసతి గృహాల నిర్వహణపై మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పలు కీలక సూచనలు చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల కింద లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 297 మంది లబ్ధిదారుల లక్ష్యం ఉండగా ఇప్పటివరకు 192 మందిని ఎంపిక చేసినట్లు సమీక్షలో వెల్లడైంది. ఎంపికైన వారిలో 117 మంది లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలు ప్రారంభించినట్లు అధికారులు వివరించారు.

మిగిలిన లబ్ధిదారుల ఎంపికను త్వరగా పూర్తి చేసి రుణాల మంజూరుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. లబ్ధిదారుల పేర్లపై నాన్-ఆపరేటివ్ బ్యాంకు ఖాతాలు ప్రారంభించి సబ్సిడీ మొత్తాల విడుదలకు వీలుగా బ్యాంకులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ ద్వారా అరులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం



చేకూరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పీఎం అజయ్ పథకం కింద ఎస్సీ రైతులకు అవసరమైన బోర్‌వెల్స్ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. సాగునీటి సౌకర్యాల ద్వారా రైతుల ఆదాయం పెరిగేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని తెలిపారు.

అర్హులైన రైతులకు పథకం ప్రయోజనాలు అందేలా క్షేత్రస్థాయిలో ప ర్య వే క్ష ణ కొనసాగించాలని ఆదేశించారు. ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు

# కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి

**తక్షణ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం**

**ప్రశ్నించే వారిపై కేసులు.. బీఆర్ఎస్ నేతల గృహ నిర్బంధం: ఎంపీ వద్దిరాజు రవిచంద్ర**



**హైదరాబాద్, ఆగస్టు 20 (వార్త సంధ్య):** కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకావడం లేదని, ప్రజలు ఎదుర్కొంటున్న తక్షణ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర విమర్శించారు. రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేస్తున్నారని, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నాయకుల ఇళ్ల వద్దకు పోలీసులు వెళ్లి గృహ నిర్బంధం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. సనత్‌నగర్ టిమ్స్ భవనాలను గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మిస్తే, వాటిని ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తానే నిర్మించినట్లు ప్రచారం చేసుకుంటూ ప్రారంభించడం విడ్డూరంగా ఉందన్నారు.

టిమ్స్ వాస్తవాలను ప్రజలకు వివరించేందుకు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్‌ఎల్పీ డిప్యూటీ లీడర్లు హరీశ్‌రావు, శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌లను పోలీసులు అడ్డుకుని గృహ నిర్బంధంలో పెట్టడం తీవ్ర అభ్యంతరకరమని రవిచంద్ర పేర్కొన్నారు.

**కూల్చివేతలే పాలకుల పనిగా మారాయి**

కొత్తగా నిర్మాణాలు చేపట్టడం చేతకాని పాలకులు ఉన్న నిర్మాణాలను కూల్చడమే పనిగా పెట్టుకున్నారని ఎంపీ విమర్శించారు. దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి విగ్రహం, దిమ్మెను తొలగించడం బాధాకరమన్నారు.

నిషేధిత భూముల జాబితా 22-ఏలో అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఇష్టారాజ్యంగా మార్పులు చేస్తున్నారనే ఆరోపణలపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, అసైన్డ్ భూములను సైతం జాబితాలో చేర్చుతున్నారని ఆరోపించిన ఆయన, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

**అన్ని వర్గాల్లో అసంతృప్తి**

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై మహిళల్లో ఆగ్రహం వ్యక్తమవుతోందని రవిచంద్ర అన్నారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు ఆందోళనలు చేస్తున్నాయని తెలిపారు.

పీఆర్సీ, డీఏల కోసం ఉద్యోగులు, ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం నిరుద్యోగ యువత ఉద్యమిస్తున్నారని పేర్కొన్నారు. రైతుబంధు/రైతుభరోసా, పంట బీమా, సాగునీరు, విద్యుత్, యూరియా సరఫరా వంటి అంశాల్లో సమస్యలు ఎదురవుతున్నాయని రైతులు ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని చెప్పారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ఆటో కార్మికులు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయలేదన్న కారణంతో బీసీలు కూడా ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని రవిచంద్ర ఆరోపించారు.

**కేసీఆర్ వైపు ప్రజల చూపు**

కాంగ్రెస్ పాలనపై విసిగిపోయిన రైతులు, మహిళలు, ఉద్యోగులు, కార్మికులు, విద్యార్థులు, యువతతో పాటు అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని ఎంపీ రవిచంద్ర అన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చి కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా

# నల్గొండను సూపర్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతాం

**రూ. 24.40 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన**
**హై లెవెల్ బ్రిడ్జి, ప్రధాన రహదారి నిర్మాణానికి శ్రీకారం**
**తాగునీరు, గృహాలు, పర్యాటకాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**
**సమస్యలులేని నల్గొండే లక్ష్యమన్న మంత్రి**



**నల్గొండ, ఆగస్టు 18 (వార్త సంధ్య):** నల్గొండను రాష్ట్రంలోనే నంబర్ వన్ "సూపర్ స్మార్ట్ సిటీ"గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా పట్టణ అభివృద్ధికి భారీ ప్రణాళికలు అమలు చేస్తున్నామని, ప్రజలు అడగకముందే అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రూ. 9.40 కోట్ల వ్యయంతో ఎస్టీ కాలనీ–అద్దంకి రోడ్ మధ్య హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు, రూ. 15 కోట్లతో పాన్గల్–భాస్కర్ థియేటర్ రహదారి అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

ఈ పనులు పూర్తయితే రవాణా సౌకర్యాలు మెరుగుపడి ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. నల్గొండలో ఇప్పటికే రూ. 500 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు. ఆధునిక మౌలిక సదుపాయాల కల్పన ద్వారా పట్టణాన్ని వేగంగా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. రహదారులు, వంతెనలు, మౌలిక వసతుల విస్తరణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజలకు 24 గంటల తాగునీటి సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తున్నామని తెలిపారు.

వైద్య, విద్యా రంగాల అభివృద్ధికి కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఆస్పత్రులు, విద్యాసంస్థలను మరింత అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. పర్యాటకరంగాన్ని ప్రోత్సహించేందుకు రోప్‌వేలు, ఛాయా సోమేశ్వర ఆలయ పార్కు వంటి ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టులు నల్గొండకు కొత్త గుర్తింపును తీసుకురావడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలను కూడా పెంచుతాయని అభిప్రాయపడ్డారు. సమస్యలులేని నల్గొండే తన ధ్యేయమని కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను ముందుగానే గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని కీలక ప్రాజెక్టులను ప్రారంభించి నల్గొండ రూపురేఖలను పూర్తిగా మార్చేస్తామని తెలిపారు.

# బీరంగూడలో సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి

**గూడెం మహిపాల్ రెడ్డి క్షేత్ర పర్యటన**
**అసంపూర్తి కల్వర్టు పనులపై ఆదేశాలు**
**రోడ్లు, యూజీడీలకు ప్రతిపాదనలు సిద్ధం**



**పటాన్‌చెరు, ఆగస్టు 19 (వార్త సంధ్య):** ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రథమ ప్రాధాన్యత అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. అమీన్పూర్ సర్కిల్ పరిధిలోని బీరంగూడ సాయికృపా కాలనీలో బుధవారం ఆయన విస్తృతంగా పర్యటించి స్థానిక ప్రజలతో సమావేశమయ్యారు.

కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పర్యటన సందర్భంగా స్థానికులు కాలనీలో నెలకొన్న పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులు అసంపూర్తిగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ప్రజల అభిప్రాయాలను శ్రద్ధగా విన్న ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులతో అక్కడికక్కడే చర్చించారు.

అసంపూర్తిగా ఉన్న కల్వర్టు నిర్మాణాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గూడెం మహిపాల్ రెడ్డి అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల్లో జాప్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడకూడదని స్పష్టం చేశారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కాలనీలో పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకుని నూతన సీసీ రోడ్లు, భూగర్భ మురుగునీటి వ్యవస్థల నిర్మాణానికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తు అవసరాలను అంచనా వేసి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే సూచించారు. సామాజిక కార్యక్రమాలు, సమావేశాలకు ఉపయోగపడేలా అన్ని సదుపాయాలతో కమ్యూనిటీ హాల్‌ను సిద్ధం చేయాలని అధికారులకు తెలిపారు. అభివృద్ధి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తామని చెప్పారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు తరచూ క్షేత్రస్థాయిలో పర్యటించాలని గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు.

స్థానిక సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు.

# కలం నుంచి ప్రజా సేవ వరకు..
# ప్రజల మనిషిగా వీరన్న ప్రస్థానం



**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 19(వార్త సంధ్య ) :** సామాన్య కుటుంబంలో జన్మించి, డిగ్రీ వరకు విద్యాభ్యాసం పూర్తి చేసిన వీరన్న తన ప్రస్థానాన్ని జర్నలిస్టుగా ప్రారంభించి, ప్రజా సమస్యలపై కలాన్ని ఆయుధంగా మలుచుకున్నారు. మారుమూల గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు, వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం చొరవ చూపుతూ ప్రజలతో బలమైన అనుబంధాన్ని ఏర్పరుచుకున్నారు. ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ వచ్చిన వీరన్నకు 'ప్రజల కోసం పనిచేయాలి' అనే సంకల్పం రాజకీయ, ప్రజా జీవితంలోకి అడుగుపెట్టేలా చేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమ స్ఫూర్తితో ప్రజల తరఫున నిలిచిన ఆయన, రాష్ట్ర ఆవిర్భావం అనంతరం కూడా అదే నిబద్ధతతో ప్రజా సమస్యలపై తన పోరాటాన్ని కొనసాగించారు.

మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్‌కు సన్నిహితంగా ఉంటూ ఆయన రాజకీయ ప్రస్థానంలో తన వంతు పాత్ర పోషించిన వీరన్న, అనంతరం పార్టీ మండల ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టి పార్టీ కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో కీలకంగా వ్యవహరించారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యే ఉండటాన్ని తన రాజకీయ జీవితానికి ప్రామాణికంగా భావించే వీరన్న గత పదిహేనేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం, మృతుల కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించడం, అవసరమైన వారికి అండగా నిలవడం వంటి కార్యక్రమాలతో ప్రజలకు మరింత చేరువయ్యారు. ఎన్నికల్లో గెలుపోటములు రాజకీయ ప్రయాణంలో సహజమేనని, కానీ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం మాత్రం నిరంతర సేవతోనే సాధ్యమని వీరన్న నమ్ముతారు. రాజకీయంగా ప్రతికూల పరిస్థితులు ఎదురైనా ప్రజలకు దూరం కాకుండా, వారి సమస్యలను తన సమస్యలుగా భావిస్తూ నిరంతరం ప్రశ్నిస్తూనే ఉన్నారు. జర్నలిస్టుగా ఉన్న సమయంలో సమస్యలను కలంతో ప్రశ్నించిన వీరన్న, ప్రజా జీవితంలోకి వచ్చిన తర్వాత అదే సమస్యలపై ప్రజలతో కలిసి పోరాడుతూ పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. ప్రజల హక్కుల కోసం ప్రశ్నించే విషయంలో ఎలాంటి ఒత్తిళ్లకు వెనుకాడకుండా తన గళాన్ని వినిపిస్తున్నారు.

## మట్టిలో పుట్టిన మాణిక్యంలా..

సామాన్య కుటుంబం నుంచి వచ్చిన ఓ యువకుడు కలాన్ని ఆయుధంగా చేసుకుని జర్నలిస్టుగా ఎదిగి, ప్రజా ఉద్యమాల్లో భాగస్వామిగా నిలిచి, రాజకీయాల్లో ప్రజల మనిషిగా గుర్తింపు పొందిన ప్రస్థానం వీరన్నది. పదవులు మారినా ప్రజలతో బంధం మారకూడదనే సిద్ధాంతంతో ఆయన ముందుకు సాగుతున్నారు. ప్రజల సమస్యలపై స్పందించడం, కష్టాల్లో ఉన్న వారికి అండగా నిలవడం, అవసరమైనప్పుడు ప్రశ్నించడం తన బాధ్యతగా భావిస్తున్న వీరన్నకు ప్రజాక్షేత్రమే జీవితం.. ప్రజాసేవే లక్ష్యం.. ప్రజలే బలం అని ఆయనను దగ్గరగా పరిశీలించిన వారు పేర్కొంటున్నారు.

# సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు వెనుకాడం.

**కార్మికుల హక్కుల సాధనకు అన్ని సంఘాలతో కలిసి పోరాటం.**

**ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్.**



**హైదరాబాద్/కొత్తగూడెం, ఆగస్టు 19 (వార్త సంధ్య):** సింగరేణి కార్మికుల ప్రధాన సమస్యలను ప్రభుత్వం, యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే అన్ని కార్మిక సంఘాలతో కలిసి సమ్మెకు వెళ్లేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. బుధవారం పీవీకే-5 భూగర్భ గని వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు.

కార్మికులపై పెర్క్స్‌కు విధిస్తున్న ఆదాయపన్ను సమస్యను పరిష్కరించాలని, సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం, యాజమాన్యం సహకరించాలని కోరారు. ఉద్యోగుల పేర్లలో ఉన్న తప్పులను సరిచేయడంతోపాటు సింగరేణి లాభాల్లో కార్మికులకు 40 శాతం వాటా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.56 వేల కోట్లను వెంటనే చెల్లించాలని కోరారు. అర్హులైన కార్మికులకు మెడికల్ ఇన్వాలిడేషన్ అందేలా ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ పోరాటం ఫలితంగా ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించేందుకు యాజమాన్యం అంగీకరించిందన్నారు.

సింగరేణిలో 15 ఏళ్లుగా కొత్త గని ప్రారంభం కాకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడుతోందని తెలిపారు. కొత్త గనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. 12వ వేతన బోర్డు ఏర్పాటులో కేంద్రం జాప్యాన్ని వ్యతిరేకిస్తూ, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెరుగైన వేతనాలు, సౌకర్యాలు కల్పించాలని కోరారు.

గనుల్లో ఆధునిక భద్రతా పరికరాలను సకాలంలో అందించాలని, భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం జీఎం వెంకట రమణను కలిసి పీవీకే-5 గనిలోని వెంటిలేషన్ సమస్యపై చర్చించారు.

ప్రభుత్వం, యాజమాన్యం స్పందించకుంటే అన్ని కార్మిక సంఘాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి సమ్మెను ఉద్ధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.బీసీ వేణుమాధవ్, జోనల్ ప్రెసిడెంట్ ఎం.డి. దయాకర్, జోనల్ జనరల్ సెక్రటరీ ఎస్. రాజ్‌కుమార్, జోనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్‌కుమార్, డివిజన్ నాయకులు హరికిషన్, టీ. వీరేందర్, కే. వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బాధితులకు భరోసా కల్పిస్తూ రాములన్న పర్యటన

**ఫారెస్ట్ అధికారి నవీన్ దశదిన కర్మకు హాజరు**
**జమ్ము పార్థివదేహానికి నివాళులు**
**-మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్**



**సింగరేణి ప్రతినిధి, ఆగస్టు 19(వార్త సంధ్య )**మండలంలో వైరా మాజీ శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ పలు కుటుంబాలను బుధవారం పరామర్శించారు. వెంకటీయా తండా గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ జడ్పీటీసీ బానోత్ దేవుల నాయక్ కుమారుడు ఫారెస్ట్ అధికారి బానోత్ నవీన్ దశదిన కర్మకు హాజరై వారి చిత్ర పటానికి పూలతో నివాళులర్పించారు.

అంతకు ముందు అనంతరం తండా గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాంకుడోత్ నరేష్ పెద్దమ్మ వాంకు డోత్ జమ్మూ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులార్పించారు. ఈకార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, మాజీ రైతుబంధు కన్వీనర్ హన్మకొండ రమేష్, మాజీ సంత చైర్మన్ అడ్డగోడా ఐలయ్య, సర్పంచ్లు అంగోత్ మత్రు, బానోత్ కుమార్ ప్రియాంక, మాజీ సర్పంచ్ లు భూక్య రంగారావు, బానోత్ రాందాస్, కుర్సం సత్యనారాయణ, బానోత్ రాందాస్ సంధ్య, వాంకుడోత్ కృష్ణ, మాజీ ఎంపీటీసీ మూడ్ మోహన్ జ్యోతి, మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, నాయకులు బత్తుల శ్రీనివాస్, అడపా పుల్లారావు, కోటప్పారావు, బబ్బుల ఉపేందర్, భూక్య రాంకిషోర్, బానోత్ రాజేష్, బానోత్ కోటి, ధరవత్ వికాస్, వాంకుడోత్ సతీష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# "వీరాభిమాని" మూవీ పోస్టర్ ఆవిష్కరణ

**ఇల్లెందు, వార్త సంధ్య :** రక్తదానం యొక్క గొప్పతనాన్ని, మానవతా విలువలను చాటిచెప్పే కథాంశంతో తెరకెక్కుతున్న "వీరాభిమాని" సినిమా పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ ప్రజా నాయకుడు గుమ్మడి నరసయ్య తన చేతుల మీదుగా ఆవిష్కరించారు.



ఈ సందర్భంగా చిత్రబృందం గుమ్మడి నరసయ్యకు కృతజ్ఞతలు తెలియజేసింది. పోస్టర్ ఆవిష్కరణ అనంతరం గుమ్మడి నరసయ్య "వీరాభిమాని" చిత్రబృందానికి శుభాభినందనలు తెలిపారు. రక్తదానం వంటి సామాజిక అంశాన్ని కథాంశంగా తీసుకుని సినిమా నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కాంబినేషన్‌లో భవిష్యత్తులో మరిన్ని మంచి చిత్రాలు రావాలని ఆకాంక్షించారు.

దివంగత శ్రీ దరిపల్లి అనంత రాములు గారి కుమారులైన దరిపల్లి బ్రదర్స్ ఈ చిత్రాన్ని నిర్మించడం సంతోషదాయకమని గుమ్మడి నరసయ్య కొనియాడారు. సామాజిక సందేశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.

# 2వేల మందిని మెడికల్ అన్‌ఫిట్ చేయాల్సిందే



**వారి వారసులకు ఉద్యోగాలు వచ్చే వరకు పోరాడుతాం**
**ఒక్క నెల మెడికల్ బోర్డు పెడితే సరిపోతుందా?**
**అలియాస్ పేర్ల సమస్యలో కూనంనేని ద్వంద్వ వైఖరి**

**హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య):** సింగరేణిలో అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 2 వేల మంది కార్మికులను మెడికల్ అన్‌ఫిట్ చేయాల్సిందేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. దరఖాస్తులన్నీ పరిష్కారమయ్యే వరకు ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించాలని ఆమె కోరారు. ఈ అంశంపై హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ రియాజ్ అహ్మద్, మాజీ మంత్రి బోడ జనార్దన్తో కలిసి బుధవారం వీడియో సందేశం విడుదల చేశారు.

గత నెలలో హెచ్ఎంఎస్, టీఆర్ఎస్ హెచ్చరికలతో ప్రభుత్వం స్పందించి మెడికల్ బోర్డు నిర్వహించిందని కవిత తెలిపారు. అయితే ఒక్క నెలకే బోర్డును పరిమితం చేయడం సరికాదన్నారు. దరఖాస్తు చేసుకున్న 2 వేల మంది సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరంతరంగా మెడికల్ బోర్డులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. మెడికల్ బోర్డు ఏర్పాటు కోసం తాము నిరవధిక దీక్షకు హెచ్చరించిన నేపథ్యంలోనే ప్రభుత్వం స్పందించిందని తెలిపారు.

డిపెండెంట్ ఉద్యోగాల విషయంలో కార్మికులకు అన్యాయం జరిగితే సహించబోమని కవిత హెచ్చరించారు. కార్మికుల వారసులకు ఉద్యోగాలు వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. అలియాస్ పేర్ల సమస్యను పరిష్కరించాలి

అలియాస్ పేర్ల కారణంగా ఉద్యోగాలు రాక ఇబ్బందులు పడుతున్న యువ కార్మికులకు కూనంనేని సాంబశివరావు అన్యాయం చేస్తున్నారని కవిత ఆరోపించారు. ఉద్యోగాల కోసం నిరాహార దీక్ష చేస్తున్న వారికి ఎలాంటి హామీ ఇవ్వకుండా దీక్ష ఎలా విరమింపజేస్తారని ప్రశ్నించారు.

గతంలో డిపెండెంట్ ఉద్యోగాల కోసం అన్ని యూనియన్లు అఫిడవిట్లు ఇచ్చినప్పటికీ కూనంనేని అఫిడవిట్ ఇవ్వకుండా తప్పించుకున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మాత్రం వారికి మేలు చేస్తున్నట్లు వ్యవహరించడం సరికాదన్నారు. కూనంనేని ద్వంద్వ వైఖరిని కార్మికులు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న ఆయన ప్రభుత్వంతో మాట్లాడి అలియాస్ పేర్ల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల ఆందోళనకు మద్దతు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం ఆందోళన చేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు కవిత తెలిపారు. ఉద్యోగులు, పెన్షనర్లు కోరుతున్న విధంగా పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు, పెండింగ్ డీఏలు, హెల్త్ కార్డుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు, ప్రమోషన్లు, బదిలీలు తదితర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న ఉద్యోగులతో ప్రభుత్వం చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని కవిత కోరారు.

# ఆదిభట్లలో అక్రమ నిర్మాణాలు!

**కార్పొరేషన్ నిబంధనలకు బేఖాతర్**

**నోటీసులు ఇచ్చినా ఆగని పనులు.. అధికారుల వైఖరిపై అనుమానాలు**

**చర్యల పేరుతో కాలయాపన చేస్తున్నారా?**

**రంగారెడ్డి, ఆగస్టు 19 (వార్త సంధ్య):** ఆదిభట్లలో అక్రమ నిర్మాణాలపై స్థానికుల ఆందోళన కొనసాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణ పనులు జరుగుతున్నాయని పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు కఠిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిర్మాణ పనులు రోజురోజుకూ కొనసాగుతున్నా అధికారులు కేవలం నోటీసులతోనే సరిపెడుతున్నారని విమర్శిస్తున్నారు.

అక్రమ నిర్మాణాల కారణంగా ప్రజల భద్రతకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదులు అందినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించడం లేదని చెబుతున్నారు. దీంతో అధికారుల వైఖరిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



### నిబంధనలు కేవలం పేదలకేనా?

సామాన్యులు చిన్న ఇల్లు నిర్మించేటప్పుడు నిబంధనల్లో చిన్న ఉల్లంఘన జరిగినా అధికారులు వెంటనే చర్యలు తీసుకుంటారని, భారీ కమర్షియల్ భవనాల విషయంలో మాత్రం అదే స్థాయిలో స్పందన కనిపించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. డబ్బున్న వారికి నిబంధనలు వేరుగా ఉంటాయా? అంటూ నిలదీస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘించినా జరిమానా చెల్లిస్తే సరిపోతుందనే ధోరణి పెరిగితే అక్రమ నిర్మాణాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టౌన్ ప్లానింగ్ విభాగం విశ్వసనీయతపై కూడా ప్రశ్నలు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు.

### ముడుపుల ఆరోపణలపై విచారణ చేయాలి

నిర్మాణంలో నిబంధనలకు విరుద్ధమైన అంశాలు ఉన్నాయనే ఆరోపణలు వస్తున్నప్పటికీ పనులు కొనసాగడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు చెబుతున్నారు. కొంతమంది అధికారులు అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయని పేర్కొన్నారు.

అయితే ఈ ఆరోపణలకు సంబంధించి అధికారుల నుంచి స్పష్టమైన వివరణ వెలువడాల్సి ఉంది. అక్రమ నిర్మాణాలకు సంబంధించి ముడుపుల ఆరోపణలు నిజమా? కాదా? అనే అంశంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

### చర్యలు ఎప్పుడు?

అక్రమ నిర్మాణాలపై నోటీసులు జారీ చేసిన అనంతరం కూడా నిర్మాణ పనులు కొనసాగకూడదని, సంబంధిత నిబంధనలను కచ్చితంగా అమలు చేయాల్సి ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. నోటీసులు ఇచ్చిన తర్వాత కూడా పనులు కొనసాగుతున్నాయంటే పర్యవేక్షణ ఎలా జరుగుతోందని ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు స్పందించి నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న నిర్మాణ పనులను నిలిపివేయాలని, నిర్మాణానికి సంబంధించిన అనుమతులు, ప్లాన్‌లు, నిబంధనల అమలుపై సమగ్రంగా పరిశీలించాలని కోరుతున్నారు. అక్రమ నిర్మాణం నిజమని తేలితే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలకు నమ్మకం సన్నగిల్లే పరిస్థితి ఏర్పడకముందే ఉన్నతాధికారులు స్పందించాలని ఆదిభట్ల వాసులు కోరుతున్నారు.

# ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఎన్నికల సంఘం: దాసోజు శ్రవణ్



**ఖైరతాబాద్‌లో ఒకే వాణిజ్య భవనంలో 44 అనుమానాస్పద ఓట్లు నమోదయ్యాయని ఆరోపణ**

**ఈఆర్‌వో, బీఎల్‌వోలపై క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య):** తెలంగాణలో, ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరుగుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ ఆరోపించారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం చేపట్టిన ప్రక్రియను అధికారులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారని విమర్శించారు.

ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం, పోలింగ్ బూత్ నంబర్ 237 పరిధిలోని బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలో ఒక ప్రైవేట్ వాణిజ్య భవనం చిరునామాపై 44 ఓట్లు నమోదయ్యాయని దాసోజు శ్రవణ్ పేర్కొన్నారు. సదరు భవనంలో కాల్ సెంటర్‌తో పాటు ఇతర ప్రైవేట్ కార్యాలయాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఎస్ఐఆర్ కు ముందు అదే చిరునామాపై 19 అనుమానాస్పద ఓట్లు ఉన్నట్లు బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లు గుర్తించారని, వాటిని తొలగించాలని సంబంధిత అధికారులను కోరినప్పటికీ చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. పైగా కొత్త ఓటర్ల జాబితాలో అదే చిరునామాపై 44 ఓట్లు నమోదయ్యాయని పేర్కొన్నారు.

### క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి

ఒక వాణిజ్య కార్యాలయ చిరునామాలో ఇంతమంది ఓటర్లు ఎలా నమోదయ్యారో ఎన్నికల సంఘం సమగ్రంగా విచారణ చేయాలని దాసోజు శ్రవణ్ డిమాండ్ చేశారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఇంటింటి పరిశీలన చేయకుండా ఓటర్ల జాబితాలను రూపొందిస్తున్నారని ఆరోపించారు. అక్రమాలను ప్రశ్నించిన బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లపై పోలీసు కేసులు పెట్టడం సరికాదన్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా ఆడిట్ నిర్వహించాలి

గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా వాణిజ్య భవనాలు, ఒకే చిరునామాపై అధిక సంఖ్యలో నమోదైన ఓట్లను గుర్తించి ప్రత్యేక ఫీల్డ్ వెరిఫికేషన్ నిర్వహించాలని దాసోజు శ్రవణ్ కోరారు. సంబంధిత ఈఆర్‌వో, బీఎల్‌వోలపై విచారణ జరిపి తప్పిదాలు రుజువైతే క్రిమినల్, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా ఓటర్ల జాబితాలో అక్రమాలను ప్రశ్నించిన బీఆర్ఎస్ బూత్ లెవల్ ఏజెంట్లపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజలు, పౌర సమాజం, మేధావులు, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ ప్రాంతాల్లోని ఓటర్ల జాబితాలను పరిశీలించి అనుమానాస్పద నమోదులను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు.

# గాయత్రికి అర్జున అవార్డు

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (వార్త సంధ్య) :** కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి జాతీయ క్రీడా పురస్కారాలను ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె పుల్లెల గాయత్రికి ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు దక్కింది. మహిళల డబుల్స్‌లో ట్రీసా జాలీతో కలిసి రాణిస్తున్న గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం విశేషం. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ అరుణ్‌కుమార్ మిశ్రా నేతృత్వంలోని ఎంపిక కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ అవార్డుల జాబితాను విడుదల చేసింది.

### తేజస్విన్,దివ్యకు ప్రత్యేక గుర్తింపు

కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం సాధించిన తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించాడు. ఫిడే మహిళల ప్రపంచకప్‌ను గెలుచుకున్న దివ్య దేశ్‌ముఖ్ కూడా అర్జున అవార్డుకు ఎంపికైంది. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్‌రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, ఆయన పోటీ నుంచి తప్పుకోవడంతో ఈ ఏడాది ఈ పురస్కారం ఎవరికీ దక్కలేదు. అరుణ్ నాయగంకు జీవన సాఫల్య పురస్కారం సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుణ్ నాయగంను అర్జున అవార్డు జీవన సాఫల్య విభాగానికి ఎంపిక చేశారు. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణ పతకం సాధించిన భారత ఫుట్‌బాల్ జట్టులో ఆయన సభ్యుడిగా ఉన్నారు. కోచ్‌లకు అందించే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురికి ప్రకటించారు.

### అర్జున అవార్డు గ్రహీతలు

అథ్లెటిక్స్‌లో తేజస్విన్ శంకర్, మహమ్మద్ అఫ్జల్, ప్రియాంక గోస్వామి; బ్యాడ్మింటన్‌లో ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి; బాక్సింగ్‌లో నరేందర్ బెర్వాల్; చెస్‌లో విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్; హాకీలో లాల్రెమ్‌సియామి, రాజ్‌కుమార్ పాల్; కబడ్డీలో సుర్జీత్, పూజ; పారా షూటింగ్‌లో ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్; పారా అథ్లెటిక్స్‌లో ఏక్తా భయాన్; రోయింగ్‌లో అరవింద్ సింగ్, షూటింగ్‌లో అఖిల్ షెయోరాన్ అర్జున అవార్డులకు ఎంపికయ్యారు.

### ఇతర పురస్కారాలు

అర్జున అవార్డు జీవన సాఫల్య విభాగంలో ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుణ్ నాయగం ఎంపికయ్యారు. ద్రోణాచార్య అవార్డులు బాక్సింగ్ కోచ్ ఛోటేలాల్ యాదవ్, అథ్లెటిక్స్ కోచ్ పర్వీర్ సింగ్, షూటింగ్ కోచ్ నేహా నందకుమార్ చవాన్‌కు దక్కాయి. ధ్యాన్‌చంద్ అవార్డును బాక్సింగ్‌లో ధర్మేంద్ర సింగ్ యాదవ్, రెజ్లింగ్‌లో వీరేందర్ కుమార్‌కు ప్రకటించారు. రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారం ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణేకు దక్కింది.



# టెస్టు ర్యాంకింగ్స్‌లో హ్యారీ బ్రూక్ అగ్రస్థానం

**దుబాయ్, ఆగస్టు 19 (వార్త సంధ్య) :** అంతర్జాతీయ క్రికెట్ మండలి టెస్టు ఆటగాళ్ల ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ మరోసారి నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకున్నాడు. బంగ్లాదేశ్‌తో జరిగిన ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ సిరీస్ తొలి మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ పేలవ ప్రదర్శన చేయడంతో అతని ర్యాంకు పడిపోయింది. దీంతో బ్రూక్ అగ్రస్థానానికి చేరుకున్నాడు. హెడ్, రూట్‌లను వెనక్కి నెట్టిన బ్రూక్ 2024 డిసెంబర్‌లో తొలిసారి టెస్టు బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని అందుకున్న బ్రూక్‌కు ఇది నాలుగోసారి నంబర్‌వన్‌గా నిలవడం.




డార్విన్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో ట్రావిస్ హెడ్ 22, 17 పరుగులకే పరిమితమయ్యాడు. దీంతో అతని రేటింగ్ తగ్గి ర్యాంకింగ్స్‌లో వెనుకకు వెళ్లాడు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ కూడా హెడ్‌ను అధిగమించాడు. ఆస్ట్రేలియా స్టార్ స్టీవ్ స్మిత్ 71, 44 పరుగులతో రాణించి మూడో స్థానానికి చేరుకున్నాడు.

### కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో శాంటో

బంగ్లాదేశ్ కెప్టెన్ నజ్ముల్ హొస్సేన్ శాంటో కెరీర్‌లోనే అత్యుత్తమ టెస్టు ర్యాంకింగ్‌ను సాధించాడు. డార్విన్ టెస్టులో 84 పరుగులు చేయడంతో తొమ్మిది స్థానాలు మెరుగుపరుచుకుని 20వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

అతని రేటింగ్ 659 పాయింట్లకు పెరిగింది. శాంటో పురోగతితో భారత ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, బంగ్లాదేశ్ బ్యాటర్ లిటన్ దాస్ తదితరులు ర్యాంకింగ్స్‌లో వెనుకకు వెళ్లారు.

### గ్రీన్, మహమూద్‌లకు భారీ లాభం

ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామెరాన్ గ్రీన్ రెండో ఇన్నింగ్స్‌లో సెంచరీ చేయడంతో ఐదు స్థానాలు మెరుగుపరుచుకుని 30వ ర్యాంక్‌కు చేరుకున్నాడు.

బంగ్లాదేశ్ ఆటగాళ్లు మోమినల్ హక్ 31వ, షాద్మాన్ ఇస్లాం 58వ, మెహిదీ హసన్ మిరాజ్ 59వ స్థానాల్లో నిలిచారు. తంజిద్ హసన్ ఏకంగా 84 స్థానాలు ఎగబాకి సంయుక్తంగా 88వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. బౌలర్లలో బంగ్లాదేశ్ సీమర్ హసన్ మహమూద్ భారీగా పురోగతి సాధించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 55 పరుగులకు ఆరు వికెట్లు తీసిన అతను 26 స్థానాలు మెరుగుపరుచుకుని 38వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. రెండో ఇన్నింగ్స్‌లో 66 పరుగులకు ఐదు వికెట్లు తీసిన

వార్త సంధ్య

# పరిశుభ్ర పరిసరాలే వ్యాధుల నివారణకు ఆయుధం

**డెస్క్, ఆగస్టు 19 (వార్త సంధ్య):** మనిషి ఆరోగ్యంగా జీవించడానికి మంచి ఆహారం, స్వచ్ఛమైన నీరు, వైద్య సదుపాయాలు ఎంత అవసరమో పరిశుభ్రమైన పరిసరాలు కూడా అంతే అవసరం. ఆధునిక వైద్య రంగం ఎన్నో అద్భుత విజయాలు సాధించినప్పటికీ, అనేక వ్యాధుల మూల కారణాలు ఇప్పటికీ అపరిశుభ్రతతోనే ముడిపడి ఉన్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థలు పదేపదే చెబుతున్నట్లుగా, నివారణ చికిత్స కంటే ఉత్తమం. ఆ నివారణలో మొదటి మెట్టు పరిశుభ్రత. ఇంటి నుంచి వీధి వరకు, గ్రామం నుంచి నగరం వరకు పరిశుభ్రతను అలవాటు చేసుకుంటే అనేక వ్యాధులను ముందుగానే అరికట్టవచ్చు.

వర్షాకాలం వచ్చిందంటే దోమల బెడద, నీటి కలుషితం, అంటువ్యాధుల వ్యాప్తి వంటి సమస్యలు పెరుగుతాయి. ఇళ్ల చుట్టూ నిల్వ నీరు ఉండటం, కాలువలు సక్రమంగా శుభ్రం చేయకపోవడం, చెత్త పేరుకుపోవడం వల్ల దోమలు విపరీతంగా పెరుగుతాయి. డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రధానంగా ఇలాంటి పరిస్థితుల్లోనే వ్యాపిస్తాయి. ప్రతి ఏడాది ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వ్యాధి నియంత్రణ చర్యలు చేపడుతున్నప్పటికీ, ప్రజలు పరిశుభ్రత పాటించకపోతే ఆశించిన ఫలితాలు సాధ్యం కావు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రతి పౌరుడి పాత్ర అత్యంత కీలకం. పరిశుభ్రత అనేది కేవలం వ్యక్తిగత అలవాటు మాత్రమే కాదు, అది సామాజిక బాధ్యత కూడా. మన ఇంటిని శుభ్రంగా ఉంచడంతో పని పూర్తికాదు. మన వీధి, కాలనీ, గ్రామం కూడా పరిశుభ్రంగా ఉండేలా అందరూ కలిసి కృషి చేయాలి.

రోడ్లపై చెత్త వేయడం, కాలువల్లో వ్యర్థాలను పడేయడం, ఖాళీ స్థలాల్లో మురుగు నీరు నిల్వ ఉండేలా చేయడం వంటి అలవాట్లు సమాజ ఆరోగ్యానికే ముప్పుగా మారుతున్నాయి. ఒకరి నిర్లక్ష్యం వల్ల మొత్తం



ప్రాంతం వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంటుంది. అందుకే పరిశుభ్రతను వ్యక్తిగత అంశంగా కాకుండా సామూహిక కర్తవ్యంగా చూడాలి. దేశంలో పారిశుధ్యంపై అవగాహన పెంచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం, ఘన వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, గ్రామీణ పరిశుభ్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాయి. అయినప్పటికీ కేవలం ప్రభుత్వ చర్యలతోనే లక్ష్యాలు సాధ్యం కావు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏ పరిశుభ్రత కార్యక్రమమూ విజయవంతం కాదు. స్థానిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు కూడా ఈ దిశగా చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉంది.

నేటి కాలంలో జీవనశైలి మార్పులతో కొత్త ఆరోగ్య సమస్యలు వస్తున్నప్పటికీ, పాత అంటువ్యాధులు ఇంకా పూర్తిగా అంతరించిపోలేదు. కలుషిత నీటి వల్ల వచ్చే విరేచనాలు, టైఫాయిడ్, హెపటైటిస్ వంటి వ్యాధులు ఇప్పటికీ అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన ఆహారం, వ్యర్థాల సరైన నిర్వహణ ఉంటే ఈ వ్యాధుల్లో చాలా వరకు నివారించవచ్చు. ప్రజారోగ్య వ్యవస్థపై భారం తగ్గించడంలో కూడా పరిశుభ్రత కీలక పాత్ర పోషిస్తుంది.

వ్యాధులు రాకుండా చూడడం ద్వారా కుటుంబాలపై పడే వైద్య ఖర్చులు కూడా తగ్గుతాయి. పిల్లల్లో పరిశుభ్రత అలవాట్లను చిన్నప్పటి నుంచే పెంపొందించాల్సిన అవసరం ఉంది. చేతులు కడుక్కోవడం, చెత్తను నిర్దేశిత ప్రదేశాల్లో వేయడం, నీటిని వృథా చేయకుండా వినియోగించడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం వంటి విషయాలను విద్యా వ్యవస్థలో భాగం చేయాలి. పరిశుభ్రతపై అవగాహన కలిగిన తరం పెరిగితే భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు కూడా గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుంది. కుటుంబం, పాఠశాల, సమాజం కలిసి ఈ బాధ్యతను నిర్వర్తించాలి.

పట్టణీకరణ వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పరిశుభ్రత సవాళ్లు కూడా పెరుగుతున్నాయి. జనాభా పెరుగుదల, వ్యర్థాల ఉత్పత్తి అధికం కావడం, మురుగు నీటి నిర్వహణలో లోపాలు వంటి కారణాలతో అనేక నగరాలు సమస్యలను ఎదుర్కొంటున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి వ్యర్థాల నిర్వహణను మెరుగుపరచడం, పునర్వినియోగ విధానాలను ప్రోత్సహించడం, పచ్చదనాన్ని పెంచడం వంటి చర్యలు చేపట్టాలి. పరిశుభ్రమైన నగరాలు ఆరోగ్యకరమైన జీవనానికి పునాది అవుతాయి. పర్యావరణ పరిరక్షణ మరియు ప్రజారోగ్యం పరస్పరం అనుసంధానమైన అంశాలు. చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం, ప్లాస్టిక్ కాలుష్యం, నీటి వనరుల కలుషితం వంటి సమస్యలు ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతున్నాయి.

అందువల్ల పరిశుభ్రతను కేవలం ఆరోగ్య సమస్యగా కాకుండా పర్యావరణ పరిరక్షణ ఉద్యమంగా కూడా చూడాలి. స్వచ్ఛమైన పరిసరాలు ఉంటేనే ఆరోగ్యకరమైన సమాజం నిర్మాణం సాధ్యమవుతుంది. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా, వ్యాధుల నివారణకు అత్యంత తక్కువ ఖర్చుతో కూడిన మార్గం పరిశుభ్రతే. ఒక ప్రాంతంలో ఆసుపత్రులు పెరగడం కంటే అక్కడ వ్యాధులు తగ్గడం గొప్ప విషయం. వైద్య చికిత్స అవసరం లేకుండా ప్రజలు ఆరోగ్యంగా ఉండే పరిస్థితులను సృష్టించడమే నిజమైన అభివృద్ధి. ఆ లక్ష్యాన్ని చేరుకోవడానికి పరిశుభ్రతను జీవన విధానంగా మార్చుకోవాలి. ప్రపంచ దోమల దినోత్సవం వంటి సందర్భాలు మనకు ఒక ముఖ్యమైన సందేశాన్ని గుర్తు చేస్తున్నాయి. వ్యాధులతో పోరాడే అత్యంత శక్తివంతమైన ఆయుధం మందులు మాత్రమే కావు; పరిశుభ్రమైన పరిసరాలూ అంతే ప్రభావవంతమైనవి. ప్రభుత్వం, స్థానిక సంస్థలు, ప్రజలు సమిష్టిగా కృషి చేసినప్పుడే వ్యాధులపై విజయం సాధించగలం. పరిశుభ్రతను ఒక రోజు కార్యక్రమంగా కాకుండా నిత్యజీవిత సంస్కృతిగా మార్చగలిగితే ఆరోగ్యవంతమైన,

# దోమలపై పోరాటమే ప్రజారోగ్య రక్షణ

మలేరియా వ్యాప్తి రహస్యాన్ని ఛేదించిన పరిశోధన

దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల పెరుగుతున్న ముప్పు

పరిశుభ్రమైన పరిసరాలే ఉత్తమ నివారణ

ప్రజల భాగస్వామ్యంతోనే విజయవంతమైన నియంత్రణ



**డెస్క్, ఆగస్టు 19 (వార్త సంధ్య):** ప్రపంచ దోమల దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం ఆగస్టు 20న నిర్వహించడం వెనుక గొప్ప వైద్య శాస్త్ర చరిత్ర దాగి ఉంది. 1897 ఆగస్టు 20న బ్రిటిష్ వైద్య శాస్త్రవేత్త రోనాల్డ్ రాస్ మలేరియా వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుందని శాస్త్రీయంగా నిరూపించారు. ఈ ఆవిష్కరణ ప్రపంచ వైద్య రంగంలో ఒక విప్లవాత్మక మలుపుగా నిలిచింది. అప్పటివరకు మలేరియా ఎలా వ్యాపిస్తుందనే విషయంలో అనేక సందేహాలు ఉండగా, రాస్ చేసిన పరిశోధన వాటికి స్పష్టత ఇచ్చింది. ఆయన కృషికి గుర్తింపుగా 1902లో వైద్య శాస్త్రంలో నోబెల్ బహుమతి కూడా లభించింది. ఈ దినం ఆయన సేవలను స్మరించుకోవడంతో పాటు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఉపయోగపడుతోంది. దోమలు ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రమాదకరమైన జీవులలో ఒకటిగా పరిగణించబడుతున్నాయి. పరిమాణంలో చిన్నవిగా కనిపించినప్పటికీ, అవి మానవాళికి కలిగించే నష్టం చాలా పెద్దది. ప్రపంచ ఆరోగ్య రంగం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రధానమైనవి. ప్రతి ఏడాది కోట్లాది మంది డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా, ఫైలేరియా, జపనీస్ ఎన్సెఫలైటిస్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారు. వేలాది మంది ప్రాణాలు కోల్పోతుండగా, లక్షలాది మంది దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోంది.

మలేరియా ఇప్పటికీ ప్రపంచ ఆరోగ్య వ్యవస్థకు పెద్ద సవాల్‌గా కొనసాగుతోంది. ఈ వ్యాధి ప్రధానంగా అనోఫిలిస్ జాతికి చెందిన ఆడ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుంది. మలేరియా సోకిన వ్యక్తికి అధిక జ్వరం, చలి, వణుకు, తలనొప్పి, బలహీనత వంటి లక్షణాలు కనిపిస్తాయి. సరైన సమయంలో చికిత్స అందకపోతే ప్రాణాపాయం కూడా సంభవించవచ్చు. ఆఫ్రికా దేశాల్లో మలేరియా కారణంగా చిన్నారుల మరణాలు ఇంకా ఆందోళన కలిగిస్తున్నాయి. వైద్య సదుపాయాలు అందుబాటులోకి వచ్చినప్పటికీ పూర్తిస్థాయిలో నిర్మూలన ఇంకా సాధ్యపడలేదు. ఇటీవలి కాలంలో డెంగ్యూ ప్రజారోగ్యానికి మరింత ముప్పుగా మారింది. ఏడిస్ దోమల ద్వారా వ్యాపించే ఈ వ్యాధి వర్షాకాలంలో వేగంగా విస్తరిస్తుంది. డెంగ్యూ బారిన పడిన వారికి తీవ్రమైన జ్వరం, కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, రక్తస్రావ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో డెంగ్యూ షాక్ సిండ్రోమ్ కారణంగా ప్రాణాపాయం కూడా ఏర్పడుతుంది. పట్టణ ప్రాంతాల్లో నిల్వ నీటి సమస్యలు ఎక్కువగా ఉండటం వల్ల డెంగ్యూ కేసులు పెరుగుతున్నాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వాతావరణ మార్పులు కూడా దోమల వ్యాప్తికి అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఉష్ణోగ్రతలు పెరగడం, వర్షపాతం విధానాల్లో మార్పులు రావడం వల్ల దోమల పెరుగుదల వేగవంతమవుతోంది. గతంలో కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన దోమల జాతులు ఇప్పుడు కొత్త ప్రాంతాలకు విస్తరిస్తున్నాయి. దీనివల్ల కొత్త ప్రాంతాల్లో కూడా వ్యాధుల ముప్పు పెరుగుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థలు వాతావరణ మార్పులు మరియు దోమల వ్యాధుల మధ్య సంబంధంపై ప్రత్యేక అధ్యయనాలు నిర్వహిస్తున్నాయి. భారత్‌లో ప్రతి వర్షాకాలం ప్రారంభమైన వెంటనే దోమల సమస్య తీవ్రరూపం దాల్చుతుంది. గ్రామాలు, పట్టణాలు అనే తేడా లేకుండా నిల్వ నీరు పేరుకుపోవడం వల్ల దోమలు విస్తరిస్తాయి. పాడైన టైర్లు, కూలర్లు, పూల కుండీలు, నీటి ట్యాంకులు, కాలువలు వంటి ప్రదేశాలు దోమల పెంపక కేంద్రాలుగా మారుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం ఫాగింగ్, లార్వా నిర్మూలన కార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ ప్రజల సహకారం లేకుండా పూర్తి స్థాయిలో ఫలితాలు సాధ్యం కావడం లేదు.

దోమల నియంత్రణలో పరిశుభ్రత అత్యంత కీలకమైన ఆయుధంగా భావించబడుతోంది. ఇంటి చుట్టుపక్కల నిల్వ నీరు లేకుండా చూసుకోవడం, చెత్త పేరుకుపోకుండా జాగ్రత్తలు తీసుకోవడం, నీటి పాత్రలను మూతపెట్టడం వంటి చర్యలు దోమల సంతానోత్పత్తిని గణనీయంగా తగ్గిస్తాయి. ప్రజలు వారానికి ఒకసారి తమ పరిసరాలను పరిశీలించి నిల్వ నీరు ఉన్న ప్రాంతాలను తొలగిస్తే వ్యాధుల వ్యాప్తిని తగ్గించవచ్చు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామూహిక పరిశుభ్రత కూడా సమానంగా అవసరం. వ్యాధుల నివారణలో వ్యక్తిగత రక్షణ చర్యలు కూడా ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. దోమతెరలు వినియోగించడం, దోమల నివారణ క్రీములు ఉపయోగించడం, పూర్తి చేతుల దుస్తులు ధరించడం వంటి చర్యలు దోమల కాట్లను తగ్గిస్తాయి. చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. జ్వరం వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చు. స్వీయ చికిత్సకు బదులుగా వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవడం అవసరం.

ప్రపంచ దోమల దినోత్సవం సందర్భంగా పలు దేశాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాయి. విద్యాసంస్థలు, ఆరోగ్య సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు దోమల వల్ల కలిగే ప్రమాదాలను వివరిస్తూ కార్యక్రమాలు చేపడతాయి. ముఖ్యంగా పిల్లల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. దోమల నియంత్రణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి బాధ్యత అని ఈ కార్యక్రమాల ద్వారా తెలియజేస్తున్నారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై పోరాటం ఒక నిరంతర ప్రక్రియ. శాస్త్రవేత్తలు కొత్త మందులు, టీకాలు, నియంత్రణ పద్ధతులపై పరిశోధనలు కొనసాగిస్తున్నప్పటికీ ప్రజల భాగస్వామ్యమే విజయానికి కీలకం. పరిశుభ్రమైన పరిసరాలు, ఆరోగ్య అవగాహన, సమిష్టి కృషి ద్వారా మాత్రమే ఈ వ్యాధులను సమర్థవంతంగా అరికట్టవచ్చు. ప్రపంచ దోమల దినోత్సవం ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను గుర్తు చేసే ముఖ్యమైన సందర్భంగా నిలుస్తోంది.

# కుత్బుల్లాపూర్ అభివృద్ధికి మరిన్ని చర్యలు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పాదయాత్ర

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

మౌలిక వసతుల విస్తరణపై హామీ

బస్తీల అభివృద్ధే ప్రధాన లక్ష్యం

**హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గాన్ని మౌలిక వసతుల పరంగా ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతర కృషి చేస్తున్నామని బీఆర్ఎస్ శాసనసభాపక్ష విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ తెలిపారు. బుధవారం 131వ డివిజన్



పరిధిలోని సంజీవయ్యనగర్ ప్రాంతంలో ఆయన పాదయాత్ర నిర్వహించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనుల పురోగతిపై స్థానికులతో చర్చించారు.

పాదయాత్ర అనంతరం దాదాపు రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ప్రాంతీయ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు ఈ పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే స్థానికులకు గణనీయమైన ఊరట లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కేపీ వివేకానంద్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. రహదారుల నిర్మాణంతో పాటు తాగునీటి పైప్‌లైన్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు.

ప్రజలకు అవసరమైన సౌకర్యాలను దశలవారీగా అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేయడం అత్యవసరమని ఎమ్మెల్యే అన్నారు. రహదారులు, డ్రైనేజీ, తాగునీటి వసతులు మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు కూడా మెరుగుపడతాయని చెప్పారు. అభివృద్ధి కార్యక్రమాలు కేవలం ప్రధాన రహదారులకే పరిమితం కాకుండా ప్రతి కాలనీ, ప్రతి బస్తీకి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని కేపీ వివేకానంద్ హామీ ఇచ్చారు. ప్రజల అవసరాలను గుర్తించి వాటికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. స్థానిక సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, వాటర్‌వర్క్స్ సిబ్బంది, కాలనీ ప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కుత్బుల్లాపూర్‌ను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేందుకు తమ కృషి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

# దేశ ఇంధన భద్రతకు బొగ్గుతో పాటు

## పునరుత్పాదక విద్యుత్‌లోనూ సింగరేణి కృషి

**మరో నాలుగు దశాబ్దాల పాటు థర్మల్ విద్యుత్‌కు డిమాండ్ ఉండొచ్చు**

**అధిక మొత్తంలో బొగ్గు అందించేందుకు సింగరేణి ప్రణాళికలు**

**ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పోలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి**




**హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య):** దేశ ఇంధన భద్రతకు అవసరమైన బొగ్గును అందించడంతోపాటు పునరుత్పాదక విద్యుత్ రంగంలోనూ సింగరేణి సంస్థ తన వంతు కృషి చేస్తుందని సింగరేణి చైర్మన్, సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఇండియన్ ఎనర్జీ సమ్మిట్ అండ్ ఎక్స్‌పోలో భాగంగా బుధవారం నిర్వహించిన 'భారత ఇంధన భద్రత–విద్యుత్ ఉత్పత్తి' గోష్టిలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణి దశాబ్దాలుగా దేశ ఇంధన అవసరాలకు బొగ్గును అందిస్తూ కీలక పాత్ర పోషిస్తోందని సీఎండీ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ విద్యుత్ అవసరాలను తీర్చేందుకు జెన్‌కో, ట్రాన్స్‌కోతో కలిసి సింగరేణి సమష్టిగా పనిచేస్తోందని పేర్కొన్నారు.

వ్యాపార విస్తరణలో భాగంగా సింగరేణి ఇప్పటికే థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్, క్రిటికల్ మినరల్స్ రంగాల్లోకి ప్రవేశించిందన్నారు. దేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తికి మరో నాలుగు దశాబ్దాల పాటు డిమాండ్ కొనసాగే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. అందువల్ల రానున్న కాలంలో బొగ్గు ఉత్పత్తిని పెంచేందుకు సింగరేణి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుందని తెలిపారు. అదే సమయంలో పునరుత్పాదక ఇంధన రంగంలోనూ సంస్థ తన బాధ్యతను సమర్థంగా నిర్వహిస్తుందని స్పష్టం చేశారు.

ఈ గోష్టికి ప్రొఫెసర్ పవన్ కుమార్ పరనంది సమన్వయకర్తగా వ్యవహరించారు. తెలంగాణ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ హాజరయ్యారు. ప్యానెల్ చర్చలో తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ సీఎండీ డాక్టర్ ఎస్. హరీష్, రాజస్థాన్ రాజ్య విద్యుత్ ఉత్పాదన్ నిగం లిమిటెడ్ సీఎండీ దేవేంద్ర శృంగి, ఎన్టీపీసీ సౌత్ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అజయ్ శర్మ, గ్రిడ్‌కో లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సత్యప్రియ రథ్, ఒడిశా పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండీ కేదార్ రంజన్ పాండు, ఛత్తీస్‌గఢ్ స్టేట్ పవర్ జనరేషన్ కంపె-

# పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం.

**ప్రపంచకప్ రెండో రౌండ్‌కు అర్హత**

**ఆమ్‌స్టెల్‌వీన్, ఆగస్టు 19(వార్త సంధ్య):** దాయాదుల పోరులో 5-3తో భారత్ విజయం ఎఫ్ఐహెచ్ పురుషుల హాకీ ప్రపంచకప్ 2026లో పాకిస్థాన్‌పై భారత్ అదరగొట్టింది. ఆమ్‌స్టెల్‌వీన్‌లోని వాగెనర్ స్టేడియంలో జరిగిన పూల్-డీ చివరి మ్యాచ్‌లో భారత్ 5-3తో పాకిస్థాన్‌ను ఓడించింది. ఈ విజయంతో భారత జట్టు ప్రపంచకప్ రెండో రౌండ్‌కు అర్హత సాధించింది.

రెండు గోల్స్ చేయడంతో భారత్ మ్యాచ్‌పై పట్టు




సాధించింది.

చివరి వరకు ఆధిక్యాన్ని కాపాడుకున్న టీమిండియా 5-3తో విజయాన్ని ఖరారు చేసింది.
ఆరు పాయింట్లతో రెండో స్థానంలో భారత్
పూల్-డీలో మూడు మ్యాచ్‌లు ఆడిన భారత్ రెండు విజయాలు సాధించి ఆరు పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. తొలి మ్యాచ్‌లో వేల్స్‌పై 3-1తో గెలిచిన భారత్.. రెండో మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో 2-4తో ఓడింది. పాకిస్థాన్‌పై విజయంతో రెండో రౌండ్‌కు చేరుకుంది. మూడు మ్యాచ్‌ల్లో మూడు విజయాలతో తొమ్మిది పాయింట్లు సాధించిన ఇంగ్లండ్ అగ్రస్థానంలో నిలిచింది.

### హర్మన్‌ప్రీత్, అభిషేక్ చెలరేగింపు

భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, అభిషేక్ చెరో రెండు గోల్స్ చేసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. మ్యాచ్ ఐదో నిమిషంలోనే హర్మన్‌ప్రీత్ గోల్ చేసి భారత్‌కు శుభారంభం అందించాడు. అనంతరం మరో గోల్ చేసి తన జట్టు ఆధిక్యాన్ని పెంచాడు. అభిషేక్ కూడా

### పెనాల్టీ స్ట్రోక్‌తో హార్దిక్ గోల్

మూడో క్వార్టర్‌లో హార్దిక్ సింగ్ పెనాల్టీ స్ట్రోక్‌ను అద్భుతంగా గోల్‌గా మలిచాడు. మరోవైపు పాకిస్థాన్ వరుసగా గోల్స్ చేసి పోటీలోకి వచ్చే ప్రయత్నం చేసింది. నాలుగో క్వార్టర్‌లో మరో గోల్ చేసినా భారత్ ఆధిక్యాన్ని తగ్గించలేకపోయింది.

### టోర్నీలో ఐదు గోల్స్‌తో హర్మన్‌ప్రీత్

పాకిస్థాన్‌పై రెండు గోల్స్ సాధించడంతో హర్మన్‌ప్రీత్ సింగ్ టోర్నీలో తన గోల్స్ సంఖ్యను ఐదుకు పెంచుకున్నాడు. వేల్స్‌పై రెండు, ఇంగ్లండ్‌పై ఒకటి, పాకిస్థాన్‌పై రెండు గోల్స్ చేశాడు. మూడు మ్యాచ్‌ల్లో ఐదు గోల్స్‌తో భారత కెప్టెన్ అద్భుతమైన ఫామ్‌లో కొనసాగుతున్నాడు.

# విరాట్ కోహ్లీకి 18తో విడదీయలేని బంధం

**న్యూఢిల్లీ, ఆగస్టు 19 (వార్త సంధ్య):** ప్రపంచ క్రికెట్‌లో 18వ నంబర్ జెర్సీ అనగానే వెంటనే గుర్తుకొచ్చే పేరు విరాట్ కోహ్లీ. ఈ జెర్సీ నంబర్‌ను కోహ్లీ స్వయంగా ఎంచుకోలేదు. అండర్-19 రోజుల్లో క్రికెట్ బోర్డు కేటాయించిన సాధారణ నంబరే 18. అయితే కాలక్రమంలో అతని జీవితంలో చోటుచేసుకున్న కీలక ఘటనలు ఇదే తేదీతో ముడిపడటంతో 18వ నంబర్ అతని జీవితంలో ప్రత్యేక గుర్తింపుగా మారింది.

**తండ్రి జ్ఞాపకంతో ముడిపడిన 18**

విరాట్ కోహ్లీ తండ్రి ప్రేమ్ కోహ్లీని ఎంతో ప్రేమించేవాడు. కోహ్లీని గొప్ప క్రికెటర్‌గా చూడాలన్నది ఆయన కల. 2006 డిసెంబర్ 18న ప్రేమ్ కోహ్లీ కన్నుమూశారు. ఆ సమయంలో రంజీ మ్యాచ్ ఆడుతున్న విరాట్.. తండ్రి మరణవార్త తెలిసినా మ్యాచ్‌కు హాజరై బ్యాటింగ్ చేశాడు. తండ్రి మర-




ణించిన తేదీ 18 కావడంతో ఆ సంఖ్య కోహ్లీకి జీవితాంతం భావోద్వేగ జ్ఞాపకంగా మిగిలిపోయింది.

అంతర్జాతీయ అరంగేట్రం కూడా 18వ తేదీనే

తండ్రి మరణం తర్వాత పట్టుదలతో ముందుకు సాగిన కోహ్లీ.. భారత జాతీయ జట్టులోకి ప్రవేశించాడు. 2008 ఆగస్టు 18న శ్రీలంకతో జరిగిన వన్డేలో అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. తండ్రి దూరమైన రోజు, ఆయన కన్న కల నెరవేరిన రోజు రెండూ 18వ తేదీలే కావడం విశేషం. విశ్వంతో ముడిపడిన సంఖ్యగా భావించిన కోహ్లీ తన జెర్సీ నంబర్ 18తో ఉన్న అనుబంధాన్ని కోహ్లీ ఒక ఇంటర్వ్యూలో ప్రత్యేకంగా ప్రస్తావించాడు. తాను కావాలని ఎంచుకోకపోయినా.. ఈ సంఖ్య తన జీవితంలోని ముఖ్యమైన ఘటనలతో ముడిపడటాన్ని ఒక అదృశ్య బంధంగా భావించాడు. అందుకే 18వ నంబర్ జెర్సీ ధరించిన ప్రతిసారీ తండ్రి జ్ఞాపకాలు, ఆయన ఆశీస్సులు తనకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తాయని కోహ్లీ భావిస్తాడు.

# తప్పు చేసిన కొడుకుకు తండ్రి చెప్పకూడని ఐదు మాటలు!

**- ఆవేశంలో పలికే పదాలు మానసిక గాయాలే**

**-కొడుకులో ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు**

**- ప్రేమతో చెప్పిన మందలింపే సరైన మార్గం**



**డెస్క్, ఆగస్టు 19 (వార్త సంధ్య ):** పిల్లలు ఎదుగుదల దశలో తెలిసో తెలియకో ఎన్నో తప్పులు చేస్తుంటారు. అలాంటి సందర్భాల్లో తల్లిదండ్రుల స్పందన వారి వ్యక్తిత్వ నిర్మాణంపై కీలక ప్రభావం చూపుతుంది. ముఖ్యంగా మగపిల్లలు తప్పు చేసినప్పుడు తండ్రి ఎలా మాట్లాడుతున్నాడన్నది వారి ఆత్మవిశ్వాసం, భావోద్వేగ స్థిరత్వం, భవిష్యత్తు ప్రవర్తనపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. మొదటిగా, "నువ్వు పనికిరాని వాడివి" అనే మాట అస్సలు చెప్పకూడదని సూచిస్తున్నారు. ఈ మాట పిల్లల్లో తమపై తాము నమ్మకం కోల్పోయేలా చేస్తుంది. ఒక తప్పును సరిదిద్దడం బదులు, తాము విలువలేని వారమనే భావన వారిలో పెరిగే ప్రమాదం ఉంటుంది. రెండవది, "మగాడివైతే ఇలా చేస్తావా?" అనే వ్యాఖ్యలు కూడా హానికరమే. మగతనాన్ని తప్పుతో ముడిపెట్టడం వల్ల పిల్లల్లో అనవసరమైన ఒత్తిడి, అపరాధ భావన పెరుగుతుంది. భావోద్వేగాలను వ్యక్తపరచకుండా అణచివేయడం వంటి సమస్యలు కూడా తలెత్తవచ్చు. మూడవది, "నీ వల్ల నాకు అవమానం వచ్చింది" అని చెప్పడం మంచిది కాదు. పిల్లలు చేసిన తప్పును వ్యక్తిగత అవమానంగా చూపడం వల్ల వారు భయంతో జీవించే పరిస్థితి ఏర్పడుతుంది. తప్పు నుంచి నేర్చుకోవడం కంటే శిక్ష భయం ఎక్కువగా మిగిలిపోతుంది. నాలుగవది, "నీ అన్న లేదా ఇతర పిల్లలను చూసి నేర్చుకో" అనే పోలికలు చేయకూడదు. ఇతరులతో పోల్చడం వల్ల అసూయ, నిరుత్సాహం పెరుగుతాయి. ప్రతి పిల్లవాడి సామర్థ్యం, ఆలోచనా విధానం భిన్నంగా ఉంటుందని గుర్తుంచుకోవాలి. ఐదవది, "నిన్ను చూస్తే నాకు అసహ్యం వేస్తోంది" వంటి కఠినమైన మాటలు పిల్లల మనసును తీవ్రంగా గాయపరుస్తాయి. తండ్రి ప్రేమను కోల్పోయాననే భావన కలిగించి, సంబంధాల్లో దూరాన్ని పెంచే ప్రమాదం ఉంటుంది. పిల్లలు తప్పు చేసినప్పుడు వారిని అవమానించడం లేదా కించపరచడం కంటే, ఆ తప్పు ఎందుకు జరిగిందో అర్థం చేసుకుని ప్రశాంతంగా వివరించడం ఉత్తమ మార్గమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రేమ, సహనం, మార్గనిర్దేశంతో చేసిన మందలింపు పిల్లలను బాధ్యతాయుతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

# సినిమా టికెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

**సింగిల్ థియేటరుల్, మలీట్‌పెల్‌క్స్‌లకు నిరిద్‌షట్ టికెట్ ధరలు ఖరారు**

**థియేటరల్ నిరవ్‌హణపై కూడా మారగ్‌దరశ్‌కాలు జారీ**




**హైదరాబాద్, ఆగస్టు 20 (వార్త సంధ్య):** సినిమా టికెట్ ధరలు, థియేటర్ల నిర్వహణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. సింగిల్ థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలో వివిధ కేటగిరీలకు అనుగుణంగా టికెట్ ధరల కనిష్ఠ, గరిష్ఠ పరిమితులను ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం నాన్ ఏసీ థియేటర్లలో నాన్ ప్రీమియం టికెట్ ధర కనిష్ఠంగా రూ.30, గరిష్ఠంగా రూ.70గా నిర్ణయించారు. అదే థియేటర్లలో ప్రీమియం టికెట్ల ధర కనిష్ఠంగా రూ.50, గరిష్ఠంగా రూ.100గా ఖరారు చేశారు.

ఏసీ థియేటర్లలో నాన్ ప్రీమియం టికెట్లకు కనిష్ఠంగా రూ.50, గరిష్ఠంగా రూ.150గా ధరలను నిర్ణయించారు. ప్రీమియం టికెట్లకు కనిష్ఠ ధర రూ.100, గరిష్ఠ ధర రూ.200గా ప్రభుత్వం పేర్కొంది.

ఇక స్పెషల్ థియేటర్లలో నాన్ ప్రీమియం టికెట్ ధరలను కనిష్ఠంగా రూ.100, గరిష్ఠంగా రూ.250గా నిర్ణయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సినిమా టికెట్ ధరలను క్రమబద్ధీకరించడంతోపాటు థియేటర్ల నిర్వహణలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకునే ఉద్దేశంతో ఈ ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. థియేటర్ యాజమాన్యాలు ప్రభుత్వం నిర్ణయించిన ధరల పరిమితులకు అనుగుణంగా టికెట్లను విక్రయించాల్సి ఉంటుంది.

టికెట్ ధరల విషయంలో పారదర్శకత పాటించడంతోపాటు ప్రేక్షకులపై అదనపు భారం పడకుండా చూడాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనలను థియేటర్ యాజమాన్యాలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది.

# సుభాష్‌నగర్ సమస్యలపై ప్రత్యేక దృష్టి

**రోజుకు ఒక వార్డు కార్యక్రమం**

**ప్రజలతో కమిషనర్ ప్రత్యక్ష భేటీ**

**పౌర సమస్యలపై సమీక్ష**

**త్వరిత పరిష్కారాలకు ఆదేశాలు**

**హైదరాబాద్, ఆగస్టు 19 (వార్త సంధ్య):** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రోజుకు ఒక వార్డు' కార్యక్రమంలో భాగంగా కమిషనర్ సుభాష్‌నగర్ వార్డును సందర్శించి స్థానిక ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్, వివిధ శాఖల అధికారులతో కలిసి వార్డులో పర్యటించిన ఆయన స్థానిక రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. వార్డు అభివృద్ధి, ప్రజలకు అందుతున్న పౌర సేవలు, పెండింగ్‌లో ఉన్న సమస్యలపై క్షేత్రస్థాయిలో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో కాలనీవాసులు తమ ప్రాంతంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా డ్రైనేజీ ఓవర్‌ఫ్లో కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని రహదారులు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయని వివరించారు.

వర్షాకాలంలో పరిస్థితి మరింత దిగజారుతోందని, సమస్యల పరిష్కారానికి శాశ్వత చర్యలు అవసరమని కోరారు.



అదేవిధంగా పార్కుల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, నిర్మాణ వ్యర్థాల తొలగింపు, కాలనీలలో పేరుకుపోతున్న చెత్త సమస్యలపై కూడా నివాసితులు అధికారుల దృష్టిని ఆకర్షించారు. ప్రజలకు విశ్రాంతి, వినోదం కల్పించే పార్కులను మరింత అభివృద్ధి చేయాలని, పిల్లలు, వృద్ధులకు అనుకూలంగా మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా దోమల నివారణ చర్యలను కూడా ముమ్మరం చేయాలని కోరారు. స్థానికులు ప్రస్తావించిన ప్రతి సమస్యను సంబంధిత సర్కిల్ అధికారులు నమోదు చేసుకున్నారు. సమస్యల తీవ్రత, పరిష్కారానికి అవసరమైన చర్యలపై కమిషనర్ అధికారులతో ప్రత్యేకంగా చర్చించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన అంశాలను వెంటనే పూర్తి చేయాలని, దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమైన సమస్యలకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను కేవలం నమోదు చేయడమే కాకుండా వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. వార్డులో అభివృద్ధి పనుల పురోగతిపై నిర్దిష్ట కాలవ్యవధిలో నివేదికలు సమర్పించాలని అధికారులను కోరారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా పరిపాలన మరింత సమర్థవంతంగా మారుతుందని కమిషనర్ పేర్కొన్నారు. 'రోజుకు ఒక వార్డు' కార్యక్రమం ద్వారా ప్రతి ప్రాంతంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి పరిష్కరించడమే లక్ష్యమన్నారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి పర్యటనలు కొనసాగిస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపర్చే చర్యలకు ప్రాధాన్యం ఇస్తామని వెల్లడించారు.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.